S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక



సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 19 | సంచిక: 87 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 13 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |


## అద్భుత రాజధాని నిర్మించి చూపుతాం

- అమరావతిని శ్మశానం.. ఎడారి అని అన్నారు
- వృధా జలాలలు వాడుకుంటే తప్పేంటి
- నేను ఏనాడూ తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోలేదు
- పోలవరం పూర్తయితే అభివృద్ధి పరుగులే
- 2026లో ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక
- ఈ ఏడాదిలో ల్యాండ్ రికార్డుల పూర్తి ప్రక్షాళన
- ఉన్నతస్థాయి సమీక్షా లో సీఎం చంద్రబాబు



**అమరావతి :** రాజధాని అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారని.. కానీ ఇదో స్పూర్తిదాయక ప్రాజెక్టు అని సిఎం చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. అధికారులతో సమీక్షలో సిఎం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు

మిగతా 5లో

### ప్రాయోజిత పథకాల నిధుల ఖర్చులో నిర్లక్ష్యం

- ప్రజల సొమ్ము మురిగిపోతే బాధ్యులెవరని ప్రశ్న
- నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని ఆదేశం
- అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం చంద్రబాబు



# అశాస్త్రీయంగా జిల్లాల విభజన

## వాటిని సరిదిద్ది పాలనాపర ఇబ్బందులు తొలగిస్తాం

- రిటైడర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- టీజీఓ డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్

**హైదరాబాద్, జనవరి 12:** తెలంగాణలో గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు, మండలాలను రేషనలైజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టీజీఓ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పాలనలో సమస్యలు సృష్టించిన ఈ జిల్లాల ఏర్పా టును సమీక్షించి సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాష్ట్రంలోని పాలనా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయడానికి అవసరమన్నారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా కొత్త జిల్లాలు ఏర్పా టు చేయడం వల్ల పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని సీఎం విమర్శించారు. జిల్లాల సరిహ ద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు. రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల

మిగతా 2 లో



### చలానా పడగానే ఖాతాలో కట్ కావాలి

- ఆ మేరకు బ్యాంక్‌తో అనుసంధానించండి
- అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో సీఎం

### దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం

వివరాలు 2లో

### సర్కారు ఉద్యోగులకు సంక్రాంతి కానుక

- డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగలోకం

2

## పీఎస్ఎల్వీ-సి62 ప్రయోగం విఫలం

### సమస్యను విశ్లేషిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు



**శ్రీహరికోట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సోమవారం షార్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సి62 రాకెట్ ప్రయోగం అనుకోని సాంకేతిక లోపంతో విఫలమైంది. ప్రయోగం ప్రారంభమైన 8 నిమిషాల 42 సెకన్ల అనంతరం రాకెట్ తొలి మూడు దశలను విజయవంతంగా పూర్తి చేసుకుని నాలుగో దశలోకి ప్రవేశించిన సమయంలో సమస్య తలెత్తినట్లు ఇస్రో వెల్లడించింది. నాలుగో దశలో ప్రయాణిస్తున్న

మిగతా 5 లో



### బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేకు షాక్

- ముత్తిరెడ్డికి చెందిన 5 కోట్ల ఆస్తులు సీజ్ చేసిన ఐటీ శాఖ

.. వివరాలు 2లో

### అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

14మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు



.. వివరాలు 3లో

యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే

## బాధగా ఉంది

- ఈ ప్రభుత్వంలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన జగన్



**అమరావతి :** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వామి వివేకానంద ఆలోచనలను ఆయన ప్రస్తావిస్తూ... యువత ఏకాగ్రత, లక్ష్యంతో కృషి చేస్తే దేశం బలపడుతుందని వివేకానంద నమ్మారని వివరించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో య-ువత మాత్రం ఆ ఆశయానికి భిన్నంగా ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు చెల్లించలేదని, రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి

మిగతా 5 లో

పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై

## సుప్రీం విచారణ

2

- విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి
- తెలంగాణకు సుప్రీం సూచన
- కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



## ఎండోమెంట్ ఆస్తులను కాపాడేది ఎవరు?

- ప్రభుత్వ ఉత్తర్వులు నిర్వీర్యం
- ప్రకాశం జిల్లాలో నిర్లక్ష్యం



**అమరావతి :** అపారమైన పశుసంపదకు రాష్ట్రం నిలయమని పశుసంవర్ధకశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకూ నిర్వహించనున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టరు, కరపత్రాలను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి

మిగతా 2 లో

## సంక్రాంతిపై వివాదం

సంక్రమణం 14నే అంటున్న కొందరు



3



# యూరియా వాడకం తగ్గించండి

**రైతులకు మంత్రి తుమ్మల సూచన ■ డ్రోన్ స్ప్రేను ప్రారంభించిన మంత్రి**

**ఖమ్మం, జనవరి 12:** పంటలకు యూరియా వాడటం వల్లే నష్టం కలుగుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. అన్నదాతలకు పెట్టుబడి ఖర్చు తగ్గాలని, ఆదాయం పెరగాలని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినయోగం తగ్గిస్తే ఆదాతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుత్తిలో డ్రోన్ స్ప్రేను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తాను పురుగులమందులకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు మంత్రి తుమ్మల. పంటకు కొట్టాల్సిన దానికంటే ఎక్కువ పురుగులమందు కొట్టి భూమాతను చంపేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాచురల్ ఫార్మింగే ఉత్తమమని.. దీనిపై రైతన్నలు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పురుగులమందుల డూప్లికేట్ కంపెనీలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పంటలకు ఎక్కడ, ఏ తెగులు ఉందని శాటిలైట్ ద్వారా సమీక్షించి రైతుకు చెప్పాలని అనుకుంటున్నామని తెలిపారు. దానికి కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటున్నామని వెల్లడించారు. అన్నదాతలందరికీ అధికారులు డ్రోన్ల మీద అవగాహన కల్పించాలని సూచించారు. తాను పంటలకు యూరియా వేయనని, యూరియా వేయకపోతే పురుగుమందు వాడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. యూరియా ఎంత కావాలంటే అంత ఇస్తామని, కానీ అది పంట చేలకు అరిష్టమని తెలిపారు. ప్రతిపక్షాలు యూరియా మీద పబ్బం గడపాలని చూస్తున్నాయని విమర్శలు గుప్పించారు. పామాయిల్, కొబ్బరికి డ్రోన్ అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా మిషన్లు కనిపెట్టాలని శాస్త్రవేత్తలను కోరారు. అన్ని దేశాల్లో మన దేశం నంబర్ వన్ అని, అన్ని రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్ర నంబర్ వన్‌గా ఉండాలనేదే తన ఆకాంక్షని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

**డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్, జనవరి 12:** సంక్రాంతి వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తించనుంది. జనవరి నెల వేతనంతో పెరిగిన డీఏను ప్రభుత్వం ఫిబ్రవరి 1న చెల్లించనుంది. 2023 జులై 1 నుంచి గతేడాది డిసెంబర్ 31 వరకు ఉన్న డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనుంది. సోమవారం సాయంత్రం అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 2023, జులై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2026 జనవరి మాసంలో తీసుకునే జీతంతో కలిపి ఈ డీఏ చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఉద్యోగులకు సైతం ఈ డీఏను వర్తింప చేయనున్నారు. యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ డీఏ కింద నిధులు చెల్లించనున్నారు. 30.03 శాతం నుంచి 33.67 శాతానికి ఈ డీఏను ప్రభుత్వం సవరించిన విషయం విదితమే.

# నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పిటిషన్

**సుప్రీంలో పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ**

**సుప్రీం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అధికారిక ప్రకటన**



**న్యూఢిల్లీ, జనవరి 12:** నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అధికారికంగా ప్రకటించారు. పిటిషన్ ఉపసంహరణ నేపథ్యంలో కేసును డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ధర్మాసనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో తెలంగాణా ప్రభుత్వానికి సీజేఐ కీలక సూచనలు చేశారు. నల్లమల సాగర్ అంశంపై రిట్ పిటిషన్ ద్వారా ముందుకు వెళ్లడం ప్రయోజనకరం కాదని స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు రిట్ పిటిషన్ సరైన మార్గం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నల్లమలసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి తమ వాదనలు, అభ్యంతరాలను వినిపించాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించారు. అదే సరైన న్యాయపరమైన మార్గమని అభిప్రాయపడ్డారు. తెలంగాణా ప్రభుత్వం పిటిషన్ ఉపసంహరించుకోవడంతో ఈ కేసును సుప్రీంకోర్టు డిస్పోజ్ ఆఫ్ చేసినట్లు ఆయన ప్రకటించారు. దీంతో భవిష్యత్తులో సివిల్ సూట్ రూపంలో ఈ అంశం మరోసారి కోర్టు ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే లింక్ ప్రాజెక్టుపై తెలంగాణా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లేవని, బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తన పిటిషన్‌లో పేర్కొంది. చట్టపరంగా మరింత పటిష్ఠంగా వ్యవహరించాలనే సుప్రీంకోర్టు సూచనతో తెలంగాణా ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకుంది. కేవలం పాలనాపరమైన ఉత్తర్వుల కోసం కాకుండా, శాశ్వత పరిష్కారం కోసం సివిల్ సూట్ ద్వారా న్యాయపోరాటం చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గోదావరి జలాల తరలింపుపై ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన వాదనలు వినిపించే అవకాశం ఉంటుందని సర్కార్ భావిస్తోంది.

# అశాస్త్రీయంగా జిల్లాల విభజన



మొదటి పేజీ తరువాయి

ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు. రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం వెల్లడించారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని.. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి త్వరలో రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కమిషన్ ఆరు నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ పై నివేదిక సమర్పిస్తుందని సీఎం చెప్పారు. అన్ని జిల్లాల్లో మండలాలు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, బ్జడెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, విధివిధానాలు రూపొందిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ సారథులుగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 'మా ప్రభుత్వ వారదులు.. సారథులు ప్రభుత్వ ఉద్యోగులే. ఆనాడు ప్రభుత్వం తప్పుడు పనులను ఉద్యోగులపై ఒత్తిడి చేసి అమలు చేయించింది. పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తి ఫామ్ హౌజ్‌లో పడుకున్నారు' అని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'నేను అన్నగా వచ్చాను. ఇప్పుడు నేను 18 గంటలు పనిచేస్తున్నాను. ఈరోజు డీఏ ఫైల్ మీద సంతకం చేసి వచ్చాను. దీంతో ప్రభుత్వానికి రూ.227కోట్ల భారం పడుతుంది' అని రేవంత్ రెడ్డి ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతీ ఉద్యోగికి రూ.1.02 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తాం. ఉద్యోగులు, ప్రభుత్వం వేరువేరు కాదు. ఇద్దరం కలిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి' అని సీఎం అన్నారు. అలాగే, భూములు, ఇసుక, ఉప్పు సబ్సిడీలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని నిరోధిస్తే ప్రభుత్వ ఆదాయం మెరుగవుతుందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. తాను ఇప్పటివరకు ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తీసుకుందామని అనుకున్నా.. ఏదో ఒక పని వచ్చి పడుతోందన్నారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులు, వారధులు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం. ఉద్యోగుల్లో కూడా నేను అంటే నచ్చని వారు చాలా మంది ఉండొచ్చు. నేను వచ్చాక ఉద్యోగుల జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చాను. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12వేల కోట్లు మేర పెండింగ్‌లో ఉన్నాయి. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయి. పన్నులు పెంచాల్సిన అవసరం లేదు. సరిగా వసూళ్లు చేస్తే చాలు'అని అన్నారు.

# దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం



**హైదరాబాద్, జనవరి 12:** దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం అందిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో 'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ. 50 కోట్లతో పరికరాలను అందించామని రేవంత్ తెలిపారు. ప్రభుత్వం మీ కోసం ఉందని చెప్పడానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15శాతం కోత విధిస్తాం. ఈ బ్జడెట్ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తున్నాం. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిని మనమే దారిలోకి తీసుకురావాలి. కన్నవారి పట్ల బాధ్యత లేనివారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని రేవంత్ అన్నారు. దివ్యాంగులు ఒకరినొకరు పెళ్లి చేసుకుంటే రూ.2లక్షల సాయం చేస్తామని ప్రకటించారు. వారిని ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం ఇస్తాం. క్రీడల్లో రాణించినవారికి ఉద్యోగాలు ఇస్తాం. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించు కుంటూ ఎదగాలి. ఈ ప్రాంతంలో ప్రత్యేక ప్రతిభావంతులకు జైపాల్ రెడ్డి స్ఫూర్తి. మా ప్రభుత్వంలో ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్‌ను కార్పొరేటర్‌గా నామినేట్ చేయాలని మంత్రులను కోరుతున్నా. అలాగే మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేయాలి. ట్రాన్స్‌జెండర్ సమస్యలను వాళ్లే చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ సమాజం స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాన్ని కోరుకుంటుంది దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కులగణన జరిగింది. కులాల జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి. మా ఒత్తిడితోనే కేంద్రం కులగణన చేస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ

- విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి
- తెలంగాణకు సుప్రీం ధర్మాసనం సూచన
- కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం: ఉత్తమ్



**న్యూఢిల్లీ, జనవరి 12:** పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది.. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని కూడా మార్గనిర్దేశంచేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు వినిపించుకోవచ్చని అభిప్రాయపడింది. అయితే.. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిస్తానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వి తెలిపారు. నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి మరోసారి వాదనలు వినిపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదించిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

# చలానా పడగానే.. ఖాతాలో కట్ కావాలి

**ఆ మేరకు బ్యాంక్‌తో అనుసంధానించండి**

**అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో సీఎం**

**హైదరాబాద్, జనవరి 12:** వాహనాలకు చలానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు కీలక సూచనలు చేశారు. అవి ఎంతో కాలం పెండింగ్‌లో లేకుండా వెంటనే వారి ఖాతాల నుంచి కట్ అయ్యేలా చూడాలన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. వాహనంపై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలన్నారు. యజమాని వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి వచ్చినప్పుడే బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకోండి. ఆ వివరాలు సింక్ చేయండి. చలాన్ పడిన వెంటనే ఆటోమేటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి కట్ కావాలని రేవంత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3 శాతం మేర నష్టం జరుగుతోందని సీఎం అన్నారు. ప్రతి నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతోందని, 3నిమిషాలకో ప్రాణం పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. సమాజంలో కొందరి నిర్లక్ష్యం మరొకరికి ప్రాణాపాయంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి. ఫిజికల్ క్రైమ్‌తో పాటు సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. వీటి నియంత్రణలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇందులో పోలీసులు, రవాణా శాఖ పని మాత్రమే కాదు.. ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు పెరిగినా.. విస్తృత అవగాహనతో మరణాల సంఖ్య తగ్గిందని చెప్పారు. అందరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జనవరి 13 నుంచి 24 వరకు పది రోజుల పాటు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పొన్న ప్రభాకర్, డిజిపి శివధర్ రెడ్డి, సివి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా పనిదినాలు.. కూలీ అమలు

- గుంతలు తవ్వే కార్యక్రమానికి చెల్లుచీటీ
- వ్యవసాయానికి ఉపాధిహామీ జోడింపు
- జీ రామ్ జీ పథకంపై దుష్ప్రచారం తగదు
- పాక్, బంగ్లాలో హిందూ మహిళలను ప్రధానిని చేయమంటారా
- ఓవైసీ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి సవాల్



**హైదరాబాద్, జనవరి 12:** వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాంఅని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ-జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడుసార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు. హిజాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయాలని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లాదేశ్‌లో హిందువులను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసీ గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

# అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

- ఎరువుల ఇవ్వలేని వాడు.. ఏం ఉద్ధరిస్తాడు
- గెలిచిన సర్పంచ్‌లతో కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనం
- ఆనాటి వైభవం అంతా కాలగర్భంలో కలిసిందని విమర్శలు




**మహబూబ్‌నగర్, జనవరి 12:** అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రంలో ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎరువలే సక్కగ ఇవ్వలేనోడు..ఇక రైతులను ఏం ఉద్ధరిస్తాడని సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు.మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. పోరాడి ఓడిన వారిని కూడా అభినందించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంపై మాట్లాడారు. 'గతంలో నేను మున్సిపల్ మంత్రిగా పనిచేసిన. 2014 కంటే ముందు మహబూబ్ నగర్ పట్టణం ఎట్లుండే ఇయ్యాల ఎట్లున్నది.. అనేది చూస్తున్న మీ అందరికీ తెలుసు. ఒక్క మహబూబ్‌నగరే కాదు, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ ఇలా ఈ జిల్లాలో ఏ పట్టణం చూసినా ఎట్ల అభివృద్ధి చెందినయో మీరందరూ చూసింర్రు. ఈ పట్టణాలు 2014కు ముందు ఎట్లుండె, ఇప్పుడు ఎట్లున్నయో మీరు గమనించండి. కేసీఆర్ నాయకత్వంలో ఒక్కటి రెండు కాదు, అన్ని పట్టణాలను అభివృద్ధి చేసుకున్నం. అన్ని పల్లెలను అభివృద్ధి చేసుకున్నం' అని చెప్పారు. 'పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల కింద.. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినం. సరే అసెంబ్లీ ఎన్నికల్లో మనం కొద్ది తేడాతో ఓడిపోయినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఒక్క పని కూడా కొత్తగా చేసింది లేదు. పల్లెల్లో కేసీఆర్ నాయకత్వంలో ట్రాక్టర్‌లు పెట్టి, నీటి ట్యాంకర్‌లు పెట్టి, చెట్లు పెట్టి, ఇంటింటికి నల్లా పెట్టి, ప్రతి పల్లె వీధుల్లో స్ట్రీట్ లైట్‌లు పెట్టి, డంపింగ్ యార్డులు పెట్టి, వైకుంఠధామాలు కట్టి, పల్లె ప్రకృతి వనాలు కట్టి బ్రహ్మాండమైన అభివృద్ధిని కేసీఆర్ చూపించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ట్యాంకర్లలో నీళ్లు లేవు, ట్రాక్టర్‌లో డీజిల్ లేదు. వీధుల్లో లైట్లు వెలుగుతలేవ్' అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధిని చూస్తావుంటే తనకు కడుపు నిండిన భావన కలిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఏం చేశారని ప్రశ్నించారు.నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఉమ్మడి నాయకులంతా కలిసి ఇవాళ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడాన్ని మెచ్చుకున్నారు. 'దాదాపు నాలుగైదు కిలోమీటర్లు ర్యాలీ తీశారు. నాకు ఆ ర్యాలీని చూస్తావుంటే 2028 ఎలక్షన్ అయిపోయింది.. మనం గెలిచినాము.. కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి అయినారు అన్నట్లుగా అనిపించింది' అన్నారు. ఆరేడు వేల మోటార్ సైకిళ్లతోటి బ్రహ్మాండంగా ర్యాలీ తీసింర్రని పార్టీ శ్రేణులను ప్రశంసించారు. 'ర్యాలీగా వస్తుంటే శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ హయాంలో మనం నిర్మించిన ఒక్కో ప్రభుత్వ భవనాన్ని చూపిస్తూ వచ్చాడు. అవన్నీ చూస్తే నాకు కడుపు నిండినట్లు అయ్యింది. మహబూబ్‌నగర్ పట్టణం ఒకప్పుడు ఎట్లుండే, ఇప్పుడు ఎట్లున్నదో మీరందరూ చూస్తా ఉన్నారు. ఒక్క మహబూబ్‌నగరే కాదు నారాయణపేటగానీ, జడ్చర్ల అభివృద్ధిగానీ, రహదారుల విస్తరణగానీ, రహదారుల వెంట వీధి వ్యాపారుల కోసం కట్టిన స్ట్రీట్ వెండింగ్ జోన్‌లుగానీ నాడు మనం చేసిన అభివృద్ధికి నిదర్శనం' అన్నారు.

# పేదల భూములకు రక్షణ కల్పిస్తాం

**కూకట్‌పల్లిలో రిజిస్ట్రార్ కార్యాలయానికి పొంగులేటి శంకుస్థాపన**



**హైదరాబాద్, జనవరి 12:** తమ ప్రభుత్వం పేదల భూములకు రక్షణ కల్పించే చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని 12 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వీటి నిర్మించేందుకు ముందుకురావడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. కూకట్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. డబ్బే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. భూములు అమ్మి ఖజానా నింపే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు భూములు తీసుకుంటే డబ్బులతో పాటు వారికి ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ కాలనీల్లో.. 40 ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలు బై నంబర్స్ వేసి ఆక్రమిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేదని మరికొన్ని చోట్లా వేలం వేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం తలుచుకుంటే కాపడకపోవడం అనేది ఉండదని ఆయన అన్నారు. అలాంటి భూములు వేలం వేయకుండా పార్కులు చేసి ప్రభుత్వం రక్షించాలను సూచించారు. పోలీస్ స్టేషన్లు.. భూముల పంచాయతీలు పరిష్కరించే కేంద్రాలుగా మారొద్దని ఆయన కోరారు. 40ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన స్థలాలను బ్రోకర్లు కబ్జా చేస్తున్నారని ఎంపి ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు పేదలు కొనుక్కున్న భూములకు రక్షణ కల్పించాలని సూచించారు. పేదలు కొన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రభుత్వం ధనికుల కోసం పనిచేయడం కాదని.. పేదల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

# విద్యారంగంలో గేమ్ ఛేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

**వీటి నిర్వహణ బాధ్యత పూర్తిగా కలెక్టర్లదే**

**వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, జనవరి 12:** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్.. రాష్ట్ర విద్యా రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రాజెక్టుకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పనులు పూర్తి చేయడానికి క్యాలెండర్ ఖరారు చేయాలని సూచించారు. ప్రతి వారం ప్రగతి సమీక్ష జరపాలని.. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి 15 రోజులకు బిల్స్ పేమెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఎక్కువ సంఖ్యలో స్కూల్స్ అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక సమానత్వం, సమగ్ర విద్యా అవకాశాలు అందరికీ అందుబాటులోకి రావాలనేది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. దేశంలోనే రోల్ మోడల్‌గా, గేమ్ ఛేంజర్‌గా నిలిచేలా ఈ స్కూల్స్ రూపకల్పన చేస్తున్నారు. ఆధునిక సౌకర్యాలు, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా-కరిక్యులర్ యాక్టివిటీస్‌తో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ స్కూల్స్ దోహదపడతాయని రేవంత్ ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 105కి పైగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబడుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున స్కూల్స్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌కు వేల కోట్ల రూపాయలు కేటాయించారు. బ్జడెట్‌లో రూ.11,600 కోట్లు, మరిన్ని దశల్లో రూ.21,000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా కుల, మత, ఆర్థిక వివక్షలు తొలగి, అందరూ ఒకే వేదికపై చదువుకునే అవకాశం లభిస్తుంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యను సమానత్వ సాధనంగా మార్చడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఇవి కేవలం భవనాల నిర్మాణం కాదు.. సమాజంలో సామరస్యం, సమాన అవకాశాలు, భవిష్యత్ తరాల బలోపేతం కోసం చేపట్టిన విప్లవాత్మక అడుగని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.



# సుప్రీం సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి

**పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌కు లైన్ క్లీయర్**


**అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు ద్రోహం**

**మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ**

**హైదరాబాద్, జనవరి 12:** రేవంత్‌రెడ్డి ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలయ్యిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ కేసులో తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సోమవారం సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయంపై హరీష్ రావు ఒక వీడియోను విడుదల చేశారు. నాడు బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే, ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ మాత్రం దానికి ఉత్తమ్ కుమార్ సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా పోవాల్సిన అవసరం ఉందా? అంటూ ప్రశ్నించారు. సివిల్ సూట్ ల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథేనని అన్నారు. బలహీనమైన రిట్టు వేసి సంక్రాంతి పండుగ సందర్భంగా రేవంత్ చంద్రబాబుకు గురు దక్షణ చెల్లించుకున్నాడని విమర్శించారు. గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. తప్పుకుండా పోరాటం చేస్తామని హరీష్ రావు వెల్లడించారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేకు షాక్

**5 కోట్ల ఆస్తులు సీజ్ చేసిన ఐటీ శాఖ**




**జనగామ, జనవరి 12:** జనగామ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన రూ.5కోట్ల విలువైన ఆస్తులను ఐటీ అధికారులు అటాచ్ చేశారు. బినామీ యాక్ట్ కింద సిద్ధిపేట, జనగామలో ఆయనకు చెందిన పలు విలువైన ఆస్తులను అటాచ్ చేస్తూ ఐటీ అధికారులు సోమవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తన కుమార్తె తుల్జా భవానీ రెడ్డి పేరు మీద జనగామ, సిద్ధిపేటలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పలు భూములు కొనుగోలు చేశారు. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఐటీ అధికారులు రంగంలోకి దిగి.. ఆ దిశగా విచారణ చేపట్టారు. తన కుమార్తెను బినామీగా పెట్టి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులకు పలు ఆధారాలు లభ్యమయ్యాయి. ఆ క్రమంలో ఈ భూముల కొనుగోలుపై యాదగిరిరెడ్డి కుమార్తె తుల్జా భవానీరెడ్డిని విచారించారు. ఈ భూములు కొనుగోలు చేసేందుకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందంటూ తుల్జా భవానీ రెడ్డిని ఐటీ అధికారులు ప్రశ్నించారు. ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందో తనకు తెలియదని ఐటీ అధికారులకు ఆమె వెల్లడించింది. తన తండ్రి సంతకం పెట్టమని చెబితేనే.. తాను ఈ భూములకు చెందిన సేల్ డీడ్‌పై సంతకం చేశానంటూ ఐటీ అధికారులకు తుల్జా భవానీ దేవి వివరించారు. ఆమె చెప్పిన స్టేట్‌మెంట్‌ను ఐటీ శాఖ ఉన్నతాధికారులు రికార్డు చేశారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా సిద్దిపేట, జనగామలో రూ.5కోట్లు విలువైన ఆస్తులను ఐటీ శాఖ అధికారులు ఫ్రీజ్ చేశారు.

# రోశయ్య సతీమణి కన్నుమూత

**హైదరాబాద్, జనవరి 12:** దివంగత మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సతీమణి కొణిజేటి శివలక్ష్మి(86) కన్నుమూశారు. ఆమె మరణం తెలుగు రాష్ట్రాల్లో విషాదాన్ని నింపింది. శివలక్ష్మి సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆమె వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ అమీర్‌పేటలోని తన నివాసంలో కన్నుమూశారు. శివలక్ష్మి మరణం వారి కుటుంబంలోనే కాకుండా, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర విషాదం నింపింది.శివలక్ష్మి మరణ వార్త తెలియగానే తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అమీర్‌పేటలోని రోశయ్య నివాసానికి అభిమానులు, కార్యకర్తలు భారీగా చేరుకొని ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్నారు. రోశయ్యకు శివలక్ష్మి అండగా ఉంటూ, ఆయన రాజకీయ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారని బంధుమిత్రులు తెలిపారు. రోశయ్య సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పినప్పటికీ.. శివలక్ష్మి తెర వెనకే ఉంటూ కుటుంబాన్ని చక్కదిద్దేవారని బంధుమిత్రులు చెబుతున్నారు.

# పీజేఆర్‌కు సీఎం నివాళి



**హైదరాబాద్, జనవరి 12:** దివంగత కాంగ్రెస్ నేత, మాజీమంత్రి పీ జనార్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా ఖైరతాబాద్ సర్కిల్‌లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పీజేఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచన నేతగా కొనియాడారు. ఆయనప్రజల కోసం నిరంతరంగా పాటుపడ్డారని అన్నారు. పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీజేపీ తనయ విజయా రెడ్డి,మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొని పీజేఆర్‌కు నివాళి అర్పించారు.




సంపాదకీయం

# జల రాజకీయాలను తిప్పికొట్టాలి!

నదీజలాల విషయంలో ఇరు తెలుగు రాష్ట్రాలు సంయమనంతో ముందుకు సాగాల్సిన తరుణమిది. జల జగడాలు మంచిది కాదు. ఈ రగడతో ప్రజలను సెంటిమెట్‌తో ముంచాలని చూస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు. ఎందుకంటే నీళ్లు కోసమే తెలంగాణ పోరాటం సాగింది. ఇందులో అనుమానాలు లేవు. అందువల్ల నీటి కోసం ప్రతిపక్షాలు చేసే విమర్శలకు లోను కావద్దు. వారి రాజకీయాలకు బలి కావద్దు. ఎపిలో జగన్, తెలంగానలో బిఆర్ఎస్ జలజగడాలతో రాజకీయం చేయచూస్తున్నాయి. వీరి మాటలను తిప్పికొట్టాలి. సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూడా జలజగడాలకన్నా పరిష్కారాలే ముఖ్యమని అంటున్నారు. అందువల్ల వాటిని అనుసరించడమే శ్రేయస్కరం. వృధాగా పోతున్న జలాలను పరిరక్షించుకోవడంలో వ్యూభాత్మకంగా అడుగులు వేయాలి. నదీజలాలలను ఎంతగా ఒడిసిపడితే అంత మంచిది. ఎండిన బీళ్లను తడపాలి. నదుల్లో నీరంతరాయంగా నీరు పారేలా ప్రణాళికలు సిద్దం చేయాలి. అయితే తెలుగునాట జల రాజకీయాలు మరింత వికృతంగా మారుతున్నాయి. ఏ స్థాయిలో దుష్ప్రచారం చేయబోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎవరి రాజకీయం వారిది. ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టగలిగి నప్పుడే రాజకీయ నాయకులు తమ పబ్బం సాధ్యమవు తుంది. తెలంగాణ ప్రజలు నీళ్లతో త్వరగా కనెక్టవుతారు. అందుకే కేసీఆర్ అండ్ కో జల వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. అలాగే జగన్ కూడా తన హయాంలో నిలిచిపోయిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు ఆపారని ప్రచారం చేస్తున్నారు. ఎప్పుడో నిలిచిపోయిన ఈ పథకం గురించి బిఆరెస్ నేతలు పెడబొబ్బలు పెడుతున్నారు. తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కెటిఆర్,హరీష్ రావులు విమర్శించడం హాస్యాస్పదం. సమాజంలో విద్వేషాలు రగిలించడానికి పెద్దగా శ్రమ పడాల్సిన అవసరం లేదు. తెలుగు రాష్ట్రాల మధ్య ప్రస్తుతం నడుస్తున్న జల వివాదంలో ప్రతిపక్షాలు తమవంతు పాత్రను పోషిస్తున్నాయి.. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై విపక్ష జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు రాజకీయం మొదలు పెట్టారు. ఈ పథకాన్ని చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆపేశారని జగన్ ఆరోపించారు. జగన్ మీడియాలో ఆంధ్రప్రదేశ్ ద్రోహిగా చంద్రబాబును చిత్రీకరిస్తుండగా, కేసీఆర్ సొంత మీడియాలో చంద్రబాబును నీటి దొంగగా, తెలంగాణ ద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నీటిని తరలించుకుపోవడం ద్వారా చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని ప్రచురిస్తున్నారు. ఈ ఇరువురు నాయకుల సొంత మీడియాలో చేస్తున్న ప్రచారంలో నిజానిజాలఅఉ ఎలా ఉన్నా కవాలని చేస్తున్న ఈ ప్రచారం కారణంగా ప్రజల్లో విద్వేషం రెచ్చొగొటటే ప్రయత్నాలు మొదలయ్యాయి. బిఆర్ఎస్ మీడియా ప్రకారం స్వరాష్ట్రం కోసం చంద్రబాబు జల చౌర్యానికి పాల్పడుతున్నారు. జగన్ మీడియా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేస్తూ తెలంగాణకు చంద్రబాబు మేలు చేస్తున్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసమే వారు అలాంటి కథనాలను వండి వారుస్తున్నారన్నది వేరుగా చెప్పనక్కరలేదు. పాలకులు ఎవరైనా తమ స్వరాష్ట్రాల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించలేరు. ఎంతటి జటిలమైన సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు. జలవివాదాలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఎపి సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనలు హుందాగా ఉన్నాయి. వివాదం పరిష్కారం కాకూడదన్న కోరిక కేసీఆర్, జగన్ రెడ్డిలకు ఉ ండవచ్చునుగానీ వారికి ఆ అవకాశం ఇవ్వకుండా సంయమనంతో వ్యవహరించవలసిన బాధ్యత ఇరు రాష్ట్రాల సిఎంలపై ఉంది. స్థానిక ఎన్నికలు సమీపించే కొద్దీ ఇలాంటివి మరికొన్నింటిని తెరమీదకు తెస్తారు. ఈ విషయంలో కేంద్రం కూడా చోద్యం చూడడం సరికాదు. కోర్టు గడపలు ఎక్కడం కూడా మంచిది కాదు. ఇరు రాష్ట్రాల జలవివాదాలపై ఉన్నతస్థాయి కమిటీకి పర్యవేక్షణ అప్పగించాలి. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని రాయలసీమకు తరలించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్ట్ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ చెబుతోంది. గోదావరి బేసిన్‌లో ఆంధప్రదేశ్ దిగువ ప్రవాహ రాష్ట్రం కావడంతో, ఇతర రాష్ట్రాల హక్కులకు భంగం కలగకుండా మిగిలిన వరద నీటిని వాడుకోవచ్చునని పేర్కొంన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై కేంద్రానికి నివేదిక సమర్పించారు. వారి సూచనల మేరకే మార్పులు చేస్తున్నారు. డీపీఆర్‌కు సంబంధించిన టెండర్లు కేవలం ముందస్తు సన్నాహక చర్య మాత్రమేనని పేర్కొన్నారు. చట్టపరమైన అన్ని అనుమతులు వచ్చాకే పోలవరం– నల్లమలసాగర్ ప్రాజెక్టు చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. గోదావరిపై పోలవరం– నల్లమల్ల సాగర్ లింక్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గోదావరి నది ప్రవహించే చివరి రాష్ట్రం ఏపీ. తెలంగాణ నుంచి ఏపీలోకి ప్రవేశించే ఈ నీరు.. అంతర్వేది వద్ద సముద్రంలో కలుస్తుంది. ఈ నీటిని వృథాగా సముద్రంలో కలిసే కంటే.. ఆ మిగులు జలాలను పోలవరం– నల్లమల్ల లింక్ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ పంపడం.. ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్నాహకాలు చేస్తోంది. అయితే ఈ లింక్ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దాంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కేసు విచారణ సుప్రీంకోర్టులో కొనసాగుతోంది. అయితే ఎలాంటి పొరపాట్లు లేకుండా ముందుకు సాగాల్సి ఉంది. ఇరు రాష్ట్రాలు కూర్చుని సమస్యలు పరిష్కరించాలి. ప్రజల్లో విద్వేషాలను రగిల్చేవారిపట్ల జాగ్రత్త వహించాలి.



# అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

## పతంగులు ఎగురవేసిన ప్రధాని మోదీ, జర్మనీ ఛాన్సలర్

**అహ్మదాబాద్, జనవరి 12:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ పతంగుల పండుగను ప్రారంభించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి నదీ తీరంలో ప్రధాని సోమవారం అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ వేడుకలో ప్రధాని మోదీతో పాటు జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ కూడా పాల్గొన్నారు. ఇద్దరూ కలిసి పతంగులను ఎగురవేశారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్‌లో కలియ తిరిగారు. ఈ ఉత్సవంలో 50 దేశాలకు చెందిన ఔత్సాహికులు పాలుపంచుకున్నారు. ఈ వేడుకలో హనుమాన్ పతంగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతేడాది ఈ ఫెస్టివల్‌కు 3.83 లక్షల మంది సందర్శకులు హాజరయ్యారు. ఈ ఏడాది సందర్శకులు సంఖ్య 5 లక్షల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.




# భారత్ మాకు నిజమైన భాగస్వామి

- నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమే
- అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు





**న్యూఢిల్లీ, జనవరి 12:** భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహబంధం నిజమైనదని అన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమేనని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగేందుకే వారు ప్రయత్నిస్తారని వ్యాఖ్యానించారు. 'ఇండియాతో భాగస్వామ్యం కంటే మాకు ఎవరూ ఎక్కువ కాదు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తాను' అని గోర్ చెప్పారు. అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందం విషయంలో సంక్లిష్టతలు ఉన్నప్పటికీ వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు రెండు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని అన్నారు. ఈనెల 13న భారత్–అమెరికా ప్రతినిధులు మరోసారి సమావేశం కావాల్సి ఉందని వెల్లడించారు. వచ్చే ఏడాది లేదా రెండేళ్లలో ట్రంప్ భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. భారత్‌కు అమెరికా రాయబారిగా ఆయన సోమవారంనాడు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమకు భారత్ తర్వాతే ఎవరైనా అని చెప్పారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద దేశమని, అందువల్ల ఒప్పందంపై ముగింపునకు తీసుకురావడం అంత తేలికైన పనికాదని, అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా ఒప్పందం కుదిరేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. భద్రత, కౌంటర్ టెర్రరిజం, ఇంధనం, సాంకేతికత, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని తెలిపారు. సిలికాన్ ఆధారిత సాంకేతికతలను రక్షించడానికి, మెరుగుపరచడానికి ఉద్దేశించిన 'ప్యాక్స్ సిలికా' కూటమిలోకి పూర్తి సభ్యత్వ దేశంగా భారత్‌ను ఆహ్వానిస్తున్నామని గోర్ వెల్లడించారు. కూటమిలో అమెరికా, జపాన్, సౌత్ కొరియా, యూకే, ఇజ్రాయెల్ దేశాలు కలిసి పనిచేయనున్నట్టు చెప్పారు.

# ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు

## బెంగాల్ సర్ ప్రక్రియపై మమత అభ్యంతరం



**కోల్‌కతా, జనవరి 12:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ ు ంో ాా రి అభ్యంతరాలు లేవ–నెత్తారు. ఈ పక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈమేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ఎస్ఐఆర్ మొదలు సీఈసీకి దీదీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారు. అయితే, ఈ పక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇది కాస్తా పెద్దఎత్తున డేటా మిస్‌మ్యాచ్‌కు దారితీసింది. దీంతో నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడ్డారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఎన్నికల సంఘం పక్కనపెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది. ఈసీ తన సొంత పద్ధతులను విస్మరించడం.. ఏకపక్షం, అహేతుకం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదు. ఈ పక్రియలోనే లోపం ఉంది. ఎస్ఐఆర్ విచారణ పక్రియ సైతం చాలావరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోంది. సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదు. ఇది మన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోందని మమతా బెనర్జీ తన లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. బెంగాల్‌లో ఎస్ఐఆర్‌లో భాగంగా 58 లక్షల మంది పేర్లను ఈసీ తొలగించిన విషయం తెలిసిందే.

# మకర సంక్రాంతిపై వివాదం

## సంక్రమణం 14నే అంటున్న కొందరు



**తిరుమల, జనవరి 12:** పండగల తేదీలపై ఏటా కొన్ని విభేదాలు వస్తూనే ఉన్నాయి. ఏ రోజు ఏ పండగ అన్నది వివాదాలకు దారితీస్తోంది. తాజాగా సంక్రాంతి పర్వదినంపైనా కొంత చర్చ మొదలయ్యింది. మకర సంక్రాంతి.. ఏడాదిలో వచ్చే తొలి పండగే కాదు. అతి పెద్ద పండగల్లో ఇది కూడా ఒకటి. ఈ ఏడాది ఈ మకర సంక్రాంతి పండగ జనవరి 14 లేదా 15వ తేదీన జరుపుకోవాలా? అనే సందేహం చాలా మందిలో కలుగుతోంది. అదీకాక చాంద్రమానం ప్రకారం ఏడాదిలో దాదాపు అన్ని పండగలు జరుపుకుంటాం. కానీ సౌరమానం ఆధారంగా సంక్రాంతిని జరుపుకుంటాం. ఇంకా చెప్పాలంటే.. సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర ఘడియలనే మకర సంక్రాంతిగా అంతా పరిగణిస్తారు. ఈ ఏడాది 14వ తేదీన పవిత్ర స్నానాలు, దానధర్మాలు, సూర్య ఆరాధన చేయాలని పండితులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని సంప్రదాయ పంచాంగాలు సూర్యోదయం ఆధారంగా నియమాలను అనుసరిస్తాయి. సూర్యుడు సాయంత్రం చాలా ఆలస్యంగా లేదా సూర్యాస్తమయం తర్వాత మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. దాంతో పండగ మరుసటి రోజు జరుపుకుంటారు. కానీ ఈ ఏడాది జనవరి 14వ తేదీ మధ్యాహ్నమే ఈ మార్పు జరుగుతుంది. దాంతో ఈ పండగ బుధవారం అంటే.. జనవరి 14వ తేదీనే జరుపుకోవాలని అంటున్నారు. దీని ప్రకారం మకర సంక్రాంతి వేడుకలకు జనవరి 14వ తేదీగా నిర్ణయించారు. ఆరోజు మధ్యాహ్నం 3.13 గంటలకు సంక్రాంతి ముహూర్తం వస్తుంది. ఈ నేపథ్యంలో ఆ రోజే పండగ జరుపుకోవాలని,. అంటే జనవరి 15వ తేదీ కాదన్నది సుస్పష్టం. అయితే ఇప్పటికే మకరసంక్రాంతి 15గా నిర్ణయించారు. ప్రభుత్వం కూడా అదేరోజు సెలవుగా పరిగణించింది. మకర సంక్రాంతి వేళ.. సూర్యుడు దక్షిణాయణం ముగించుకుని.. ఉత్తరాయణం దిశగా ప్రారంభాన్ని సూచిస్తుంది. సూర్య భగవానుడి ప్రయాణ మార్పు ఆశ, కాంతి, సానుకూల శక్తిని తెస్తుందని అంతా ప్రగాఢంగా విశ్వసిస్తారు.ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు సూర్యుడిని పూజిస్తారు. పేదవారికి వస్త్రాలు దానం చేస్తారు. తమిళనాడులో పొంగల్‌గా ఈ పండగను జరుపుకుంటారు. ఇది అనేక రోజుల పంట పండగా వారు భావిస్తారు.అసోంలో మాఘ్ బిహుగా జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్లో: పౌష్ పర్బన్ అని ఈ పండగను పిలుస్తారు. అయితే ఈ పండగ పేర్లు, ఆచారాలు భిన్నంగా ఉన్నప్పటికీ అన్ని వేడుకలు పంట శ్రేయస్సుతోపాటు కృతజ్ఞతతో ముడిపడి ఉంటాయి.

# డ్రోన్‌లతో సరిహద్దుల్లో పాక్ కవ్వింపులు

- తిప్పికొట్టిన సైన్యం

**శ్రీనగర్:** భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'తో కొద్దికాలంగా స్తబ్దుగా ఉన్న పాకిస్థాన్ మరోసారి కవ్వింపులకు దిగింది. జమ్మూకశ్మీర్‌లోని లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్వోసీ) వెంబడి రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా ఐదు డ్రోన్లు సంచరిస్తున్నట్టు భారత సైన్యం గుర్తించింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు వాటిని తిప్పికొట్టాయి. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తినష్టం కానీ, ప్రాణనష్టం కానీ జరగలేదు. భారత సైనిక వర్గాల సమచారం ప్రకారం, పాకిస్థాన్ ఆర్మీకి చెందిన కొన్ని డ్రోన్లు ముఖ్యంగా నౌషెరా–రాజౌరీ సెక్టార్‌లో సంచరిస్తున్నట్టు గుర్తించారు. దీంతో వెంటనే సైనిక విభాగాలు ఆపరేషన్ ప్రారంభించాయి. మీడియం, లైట్ మిషన్‌గన్‌లతో కాల్పులు జరిపాయి. పాక్ డ్రోన్ కదలికలతో ఎల్ఓసీ, అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి భద్రత, నిఘాను మరింత కట్టుదిట్టం చేశామని, భారత బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని సెక్యూరిటీ అధికారులు చెప్పారు. గత ఏడాది మే 7న పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పలు పాక్ డ్రోన్లను కూల్చేసింది. అప్పటి నుంచి డ్రోన్ల సంచారం తగ్గింది. అయితే తిరిగి డ్రోన్ల కదలికలు కనిపించడంతో ఉగ్రవాద గ్రూపులకు మద్దతుగా మాదక ద్రవ్యాలు, ఆయుధాలు జారవిడిచేందుకు డ్రోన్లను ఉపయోగించినట్టుగా అనుమానిస్తున్నారు. దీంతో భద్రతా బలగాలు పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.



# అద్భుత రాజధాని నిర్మించి చూపుతాం

మొదటి పేజీ తరువాయి

అని.. అది పూర్తయితే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని సీఎం గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాపాడుకున్నామని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని.. ఆ ఎ÷-లాంట్‌ను




నిలబెట్టి తీరుతామన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని తెలిపారు. పెట్టుబడులకు డెస్టినేషన్‌గా రాష్ట్రం మారిందన్నారు. ఎస్ఐపీబీ ద్వారా రూ.8.74లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని.. వాటి ద్వారా కూడా పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు.

## నారావారిపల్లెలోనే సంక్రాతి సంబరాలు

**కుప్పం :** సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఆయన స్వగ్రామం నారావారిపల్లికి చేరుకున్నారు. రాజధాని అమరావతి నుంచి హెలికాప్టర్‌లో ఆయన స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు జిల్లా ఉన్నతాధికారులతోపాటు స్థానిక నేతలు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ఇక ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఈ రోజు ఉదయమే సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి ఈ గ్రామానికి చేరుకున్నారు. అలాగే నందమూరి బాలకృష్ణ ఫ్యామిలీ సైతం ఇప్పటికే నారావారిపల్లికి విచ్చేసింది. నందమూరి రామకృష్ణ, బాలకృష్ణ చిన్న అల్లుడు, విశాఖ ఎంపీ ఎం.భరత్ సైతం నారావారిపల్లికు చేరుకున్నారు. నారా, నందమూరి ఫ్యామిలీలు చేరుకోవడంతో.. సీఎం స్వగ్రామానికి కొత్త శోభ వచ్చింది. సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆయన స్వగ్రామంతోపాటు పరిసర గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి పండగను నారా, నందమూరి ఫ్యామిలీలు ఈ నారావారిపల్లిలో జరుపుకోవడం అనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. తల్లిదండ్రుల సమాధులను సైతం చంద్రబాబు సందర్శించుకొని వారికి ఘన నివాళులు అర్పిస్తుంటారు.

## ప్రాయోజిత పథకాల నిధుల ఖర్చులో నిర్లక్ష్యం

**ప్రజల సొమ్ము మురిగిపోతే బాధ్యులెవరని ప్రశ్న**

**నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని ఆదేశం**

**అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం చంద్రబాబు**

**అమరావతి :** కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు సరిగా ఖర్చు చేయకపోవడంపై సీఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు , విభాగాధిపతులతో జరిగిన కీలక సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా ప్రజల సొమ్ము మురిగిపోయేలా చేసే హక్కు ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు. ఈనెల 15వ తేదీ డెడ్‌లైన్‌గా ఇచ్చినా ఎందుకు ఖర్చు చేయడం లేదని సీఎం నిలదీశారు. సామాజిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల్లో నిధులు ఎక్కువగా మిగిలి పోయాయని ముఖ్యమంత్రి ఆగ్రహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో సుమారు రూ.320 కోట్లు ఉంటే కేవలం రూ.120 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా అన్ని నిధులు పూర్తిగా ఖర్చు చేయాలని, లేకపోతే వెంటపడతామని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి మొదటి, రెండో వారాల్లో పెట్టి, మార్చి 15 నాటికి అంతా ముగించాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మార్చి 15 నుంచి సెక్రటరీలు ఢిల్లీ వెళ్లి డబ్బులు తెస్తారని చూస్తుంటే ఇలా చేస్తారా అని నిలదీశారు. ఇలా అయితే వారానికి ఒకసారి మీటింగ్ పెట్టాలా? అని ప్రశ్నించారు. అన్ని శాఖలతో పోల్చితే ÷నాన్స్ శాఖ మాత్రం బాగా పనిచేస్తోందని ప్రశంసించిన సీఎం... వారే ఇతర శాఖల వెంటపడుతున్నారని తెలిపారు. ఈనెలాఖరులోగా కేంద్ర పథకాల డబ్బులు ఖర్చు చేసి, మార్చి నాటికి అందరూ ఢిల్లీ వెళ్లి డబ్బులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రజల ఆశలను నిలబెట్టామని.. వారిలో విశ్వాసాన్ని మళ్లీ కల్పించామని సీఎం చంద్రబాబు అన్నారు. 2025 ఏడాది మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామన్నారు. సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని.. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామన్నారు. జీఎస్‌డీపీ, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై చర్చించారు. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశామని సీఎం అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా 3.5కోట్ల మంది మహిళలు ప్రయాణాలు చేశారని.. దీనికోసం ఇప్పటి వరకు రూ.1,114 కోట్ల వ్యయం చేశామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద 46లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు ఖాతాల్లో వేశామని వివరించారు. ఏడాదిన్నరలో 50వేల కోట్ల మేర పింఛన్లు అందించడంతో సంక్షేమంలో కొత్త మైలురాయిని సాధించామని సీఎం పేర్కొన్నారు.




## అపారమైన పశుసంపదకు రాష్ట్రం నిలయం

**19 నుంచి 31 వరకూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు**

**పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి అచ్చన్నాయుడు**

**అమరావతి :** అపారమైన పశుసంపదకు రాష్ట్రం నిలయమని పశు సంవర్ధకశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకూ నిర్వహించనున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టరు, కరపత్రాలను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఒంగోలు, పుంగనూరు, గో జాతులు, శ్రేష్టమైన నెల్లూరు, మాచెర్ల గొర్రెల జాతులు, ఆశిల్ జాతి కోళ్లు మన రాష్ట్రంలో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా స్థిరమైన ఆదాయ వనరుగా పశుసంవర్ధక రంగం కొనసాగుతూ, ఈ రంగంపై ఆధారపడిన వారికి ప్రధాన జీవనాధారంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి ఉన్నాయన్నారు. ప్రస్తుతం 1.08 కోట్ల ఆవులు, గేదెలు, 2.31 కోట్ల గొర్రెలు, మేకలు, 10.78 కోట్ల కోళ్లు ఉన్నట్లు తెలిపారు. గతేడాది 13,257 గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశుఆరోగ్య శిబిరాల్లో 10.48 లక్షల పశువులకు వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ టి దామోదరనాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సాయిగోపాల్, అసిస్టెంట్ సర్జన్ మురళీమోహన్ తదితరులు పాల్గన్నారు.

## ఎండోమెంట్ ఆస్తులను కాపాడేది ఎవరు?

**ప్రభుత్వ ఉత్తర్వులు నిర్వీర్యం ● ప్రకాశం జిల్లాలో నిర్లక్ష్యం**

**ప్రకాశం, జనవరి 13 (సమయం) :** ప్రకాశం జిల్లావ్యాప్తంగా ఉన్న ఎండోమెంట్ ఆస్తుల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు, చట్టపరమైన నిబంధనలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలుకావడం లేదన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఎండోమెంట్ ఆస్తులు అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ పరిపాలనా వైఫల్యానికి సింగరాయకొండ పట్టణంలో



ఉన్న శతాబ్దకాల చరిత్ర కలిగిన సత్రం (చౌల్ట్రీ) భూమి ఒక ప్రతినిధి ఉదాహరణ మాత్రమేనని స్థానికులు చెబుతున్నారు. ఇదే తరహా అక్రమ ఆక్రమణలు జిల్లాలోని పలు దేవాలయాలు, సత్రాలు, ధర్మాదాయ భూములపై కొనసాగుతున్నాయని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. అక్రమ ఆక్రమణల తొలగింపునకు సంబంధించి ప్రభుత్వం +.నా.వీం.చీశీ.60 (తేదీ: 17-06-2023) ద్వారా స్పష్టమైన, కాలపరిమితి గల ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ప్రకాశం జిల్లాలో వాటి అమలు ఇప్పటివరకు గణనీయంగా జరగలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా స్థాయిలో సంబంధిత అధికారుల నుంచి నివేదికలు కోరిన అనంతరం కూడా ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు చేపట్టకపోవడం పరిపాలనా నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని పేర్కొంటున్నారు. ఇదే సమయంలో, ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ హిందూ మత ధర్మాదాయాల చట్టం, 1987 ఉ సెక్షన్ 77 ప్రకారం అక్రమంగా ఆక్రమించబడిన ఎండోమెంట్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులకు పూర్తి చట్టబద్ధ అధికారం ఉన్నప్పటికీ, ఆ నిబంధనను అమలు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రకాశం జిల్లావ్యాప్తంగా ఉన్న ఎండోమెంట్ ఆస్తులపై అక్రమ ఆక్రమణలను తక్షణమే తొలగించాలని, విధుల నిర్వర్తనలో విఫలమైన బాధ్యులైన అధికారులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఎండోమెంట్ ఆస్తులు ప్రజల విశ్వాసంతో ముడిపడి ఉన్నవని, వాటి పరిరక్షణలో అలసత్వం ఆమోదయోగ్యం కాదని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ అంశంపై తక్షణ జోక్యం చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రకాశం జిల్లాలోని ఎండోమెంట్ ఆస్తుల పరిరక్షణ లోపాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీకి అధికారిక ఫిర్యాదు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఉత్తర్వులు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

## యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉంది

మొదటి పేజీ తరువాయి



దీవెన బకాయిలు పేరుకుపోయాయని జగన్ విమర్శించారు. మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన... నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కూడా రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు నిలిపివేయడం వల్ల యువత నైపుణ్యాలు పెంచుకునే అవకాశాలు కూడా దూరమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ పాలనలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, చంద్రబాబు యువతకు వెన్నుపోటు పొడిచారని జగన్ విమర్శించారు. ఇకనైనా మేల్కొని యువతకు అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.



## పీఎస్ఎల్‌వీ-సి62 ప్రయోగం విఫలం

మొదటి పేజీ తరువాయి



సమయంలో రాకెట్ గమనం స్పష్టంగా తెలియకపోవడంతో పాటు, శాటిలైట్ కమ్యూనికేషన్ అకస్మాత్తుగా గ్రౌండ్ స్టేషన్లతో కట్ ఆఫ్ అయింది. దీంతో రాకెట్ దిశపై స్పష్టత కోల్పోయిన శాస్త్రవేత్తలు వెంటనే అప్రమత్తమయ్యారు. క్షణాల్లోనే మిషన్ కంట్రోల్‌లో ఆందోళన నెలకొంది. ఈ సందర్భంగా మీడియా ముందుకు వచ్చిన ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ మాట్లాడుతూ, "రాకెట్ తొలి మూడు దశలు పూర్తయ్యాయి. అయితే నాలుగో దశలో ప్రయాణిస్తున్న సమయంలో గమనం స్పష్టంగా తెలియకపోవడంతో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ అందకపోవడం వల్ల ప్రయోగం విఫలమైంది" అని తెలిపారు. ప్రయోగం విఫలానికి గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు లోతైన పరిశీలన చేపట్టినట్లు చైర్మన్ చెప్పారు. పూర్తి సాంకేతిక వివరాలను విశ్లేషించిన అనంతరం మీడియాకు సమగ్ర సమాచారం అందిస్తామని ఆయన వెల్లడించారు. ఇస్రో చరిత్రలో ఎన్నో విజయవంతమైన ప్రయోగాలు ఉన్నప్పటికీ, ఈసారి ఎదురైన సాంకేతిక సవాల్‌ను కూడా శాస్త్రవేత్తలు సమర్థంగా అధిగమిస్తారనే నమ్మకం వ్యక్తమవుతోంది.

## సంక్రాంతి వేళ మందుబాబులకు షాక్



**అమరావతి :** కొత్త ఏడాది ప్రారంభమైన కొన్ని రోజులకే.. అది కూడా సంక్రాంతి పండగకు కొన్ని గంటల ముందు మందుబాబులకు ఏపీ ఎక్సైజ్ శాఖ గట్టి షాక్ ఇచ్చింది. కొన్ని రకాల మద్యం బాటిల్స్‌పై రూ.10ల ధర పెంచింది. అన్ని సైజుల బాటిళ్లపై రూ.10 పెంచింది. అయితే కొన్ని బాటిళ్లను మాత్రం అందులో నుంచి మినహాయించింది. ఈ మేరకు ఏపీ ఎక్సైజ్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.99 ఇండియన్ మేడ్ ఫారన్ లిక్కర్, బీర్, వైన్, ఆర్‌టీడీలకు ఈ పెంపు వర్తించదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అలాగే బార్లపై విధిస్తున్న అదనపు ఏఆర్ఈటీ తొలగింపును అంగీకరిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. బార్లు- షాపుల మధ్య ధరల సమానత్వమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. రిటైలర్ మార్జిన్ సుమారు 1శాతం పెంచుతున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో వివరించింది. ఇక ఐఎంఎఫ్ఎల్, ఎఫ్ఎల్, బీర్, వైన్ షాప్‌లకు మార్జిన్‌ను పెంచింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

## పలువురు ఐఏఎస్‌ల బదిలీలు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా, సమతుల్యంగా నడిపించేందుకు 14 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి .విజయానంద్ జారీ చేశారు. ఈ మార్పులు జిల్లాస్థాయి పరిపాలనా శాఖల్లో కీలక బాధ్యతలను పునర్విభజన చేసేలా ఉన్నాయి. ఈ బదిలీల్లో పలు ముఖ్యమైన మార్పులు ఉన్నాయి. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా శ్రీవాస్ నుపుర్ అజయ్ కుమార్ నియమితులయ్యారు. గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీ కల్పన కుమారి బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కల్పన కుమారి,విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కతవాటె మయూర్ అశోక్, గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా కతవాటె మయూర్ అశోక్, తిరుపతి జేసీ, తుడా వైఎస్ చైర్మన్‌గా ఆర్.గోవిందరావు, వైఎస్ఆర్ కడప జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్, వైఎస్ఆర్ కడప జాయింట్ కలెక్టర్‌గా నిధి మీనా నియామకం అయ్యారు. ప్రస్తుతం అనంతపురం జేసీగా ఉన్న శివ్ నారాయణ శర్మ బదిలీ అయ్యారు. అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా సి.విష్ణు చరణ్ నియామకం జరగింది. ఎపీటీఎస్ ఎండీ మల్లవరపు సూర్యతేజ బదిలీ అయ్యారు. అనకాపల్లి జాయింట్ కలెక్టర్‌గా మల్లవరపు సూర్యతేజ, చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ నియమితులయ్యారు. వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ ఎస్ఎస్ శోబిక, గిరిజన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీగానియామకం జరిగింది. చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిల్ల విద్యాధరి బదిలీ అయి విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శివ్ నారాయణ్ శర్మ నియామకం జరిగింది. తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ బదిలీ అయి, పల్నాడు జిల్లా జేసీగా వి.సంజనా సింహ నియామకం అయ్యారు.

## జాతీయ జూడో పోటీలకు అర్హత సాధించిన విజ్ఞాన్



**సూర్యాపేట, జనవరి 12( సమయం న్యూస్) :** టేకుమట్ల గ్రామానికి చెందిన కర్ర శ్రీ విజ్ఞాన్ తండ్రి జ్ఞాన నంద ప్రకాష్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అభినందించారు. షేక్‌పేట మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విజ్ఞాన్, జూడో క్రీడలో ప్రతిభ చూపి ఈ నెల 22 నుంచి 27 వరకు కేరళ, కలకత్తా, ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతూ అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.




## ప్రజలు తమ ఈ – వేస్ట్ ను స్వచ్ఛందంగా
# జీహెచ్ఎంసీ సిబ్బందికి అప్పగించాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్
- బాగ్ లింగంపల్లి లో మెగా ఈ-వేస్ట్ సేకరణ డ్రైవ్‌ను పరిశీలించిన జీహెచ్ఎంసీ కమిషనర్

**హైదరాబాద్, జనవరి 12( సమయం న్యూస్) :**

నగర ప్రజలు తమ ఈ – వేస్ట్ ను స్వచ్ఛందంగా జీహెచ్ఎంసీ సిబ్బందికి అప్పగించాలనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ముషీరాబాద్ సర్కిల్‌లోని బాగ్‌లింగంపల్లిలో నిర్వహిస్తున్న మెగా ఈ–వేస్ట్ సేకరణ డ్రైవ్‌ను సందర్శించి, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, శాస్త్రీయంగా నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ–వేస్ట్ సేకరణ ప్రత్యేక కేంద్రాలలో ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు ఫీల్డ్ స్థాయి సిబ్బందితో మాట్లాడి, ప్రత్యేక వాహనాలు, ప్రత్యేక కౌంటర్ల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత, వినియోగం లో లేని ఎలక్ట్రానిక్ వస్తువులను నిర్దేశిత సేకరణ కేంద్రాల్లో అప్పగించి ప్రజలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అశాస్త్రీయంగా ఈ–వేస్ట్‌ను పారవేయడం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా, ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించిన ఆయన, ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. కాగా నేడు ప్రారంభమైన ఈ డ్రైవ్ రేపటితో ముగియనుంది. ఐటీ ప్రాంతాలు, ఎలక్ట్రానిక్ షాప్ లు అధికంగా ఉన్న ప్రదేశాల పై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే జోనల్, డిప్యూటీ కమిషనర్ లు క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ వేస్టులు ఇష్టారీతిన పరవేయడం వల్ల వచ్చే అనర్థాలను వివరించి వారిని చైతన్యం చేశారు. ఈ వేస్ట్ సేకరణ కోసంప్రత్యేక వాహనాలను, కౌంటర్ లను ఏర్పాటు జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది.

## మా తలరాతలు మారాలంటే
# ఎన్ని తరాలు మారాలే...

- వందేళ్ల క్రితం ఎలా బాధపడ్డరో అలాగే బాధపడతున్నం
- మూడేళ్లుగా మమ్మల్ని తిట్టేది బ్రాహ్మణ సంఘానికి కనబడుతలేదా
- దుద్దిళ్ల శ్రీధర్ మారకపోతే బ్రాహ్మణ సంఘమే బాధ్యత వహించాలే
- మా ఓట్లతో గెలిచిండనే దుద్దిళ్ల కుటుంబాన్ని ప్రశ్నిస్తున్న
- సమాధానం చెప్పకుండా మావాళ్లతోనే తిట్టిపిస్తున్న ఎమ్మెల్యే
- రాజ్యాంగానికి తూట్లు పొడిచి అశాంతికి కారణమవుతున్న ఎమ్మెల్యే శ్రీధర్
- సోషల్ మీడియా పోస్టులపై రాష్ట్ర డీజీపీ..సీపీలకు ఫిర్యాదు చేశా
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని, జనవరి12( సమయం న్యూస్)** : బ్రిటిష్ పాలన కంటే ఎక్కువగా నడుస్తున్న ఈ రాచరికపు పాలనలో మా తలరాతలు మారాలంటే ఎన్ని తరాలు మారాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రశ్నించారు. సోమవారం మంథనిలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గత మూడేళ్లుగా తన కుటుంబంపై సోషల్ మీడియాలో దుర్భాషలాడుతూ పెట్టిన పోస్టులపై రాష్ట్ర డీజీపీ, సీపీ, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు జ్యోతిరావుపూలే బ్రాహ్మణ పాలనతో ఎలాంటి ఇబ్బందులు పడ్డారో ప్రస్తుతం తాము అదేరీతిలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, వందేళ్లనాటి కాలం మళ్లీ పునరావృతం అవుతోందన్నారు. మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్ వచ్చిన రెండేళ్లతో పాటు అంతకు ముందు ఏడాదిగా తమ తన బార్య, కూతురుతో పాటు తనపై సోషల్ మీడియా వేదికగా దుర్బాషలాడుతున్నారని అన్నారు. పన్నూరోడు రాస్తే అడవిశ్రీరాంపూరోడు పోస్టులు పెడుతూ తమ కుటుంబాన్ని తిడుతున్నారని ఆయన అన్నారు. తాను ఆనాడు బీసీ సామాజికవర్గం నుంచి ఎదిగిన బిడ్డగా చట్టం చూసుకుంటుందని ఓపిక పట్టానని, కానీ రోజురోజుకు వారి ఆగడాలు మితిమీరుతున్నాయని అన్నారు. అయితే రెండేళ్ల కాలంలో ఎమ్మెల్యే శ్రీధర్ తన వైఖరి మార్చుకుంటాడని, మా సామాజికవర్గం వాళ్లని తనపైకి ఉసిగొల్పడంలో చొరవచూపడని అనుకున్నానని, కానీ మా వాళ్లే నా ఇంటిపైకి వచ్చి చంపేందుకు చూశారని ఆయన వాపోయారు. తనపై ఇంత కక్ష్య కుట్రలు ఎందుకని ప్రశ్నించారు. తాను పేదలకు సేవ చేసినందుకా, ఆడబిడ్డలకు పెండ్లిళ్లు చేసినందుకా..గరీబు బిడ్డలకు చదువుచెప్పించినందుకా అని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలేను అర్థం చేసుకున్న కనుకనే మా వాళ్ల మీదకు గొడవకు పోవడం లేదన్నారు. కానీ ప్రజాస్వామ్యబద్దంగా ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌ను ప్రజల పక్షాన ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా తిట్టిపించడం ఎంతవరకు సమంజసమన్నారు. తాము దుద్దళ్ల కుటుంబాన్ని తిడితే హైదరాబాద్‌లోని షోకాల్డ్ బ్రాహ్మణ సంఘం స్పందించి హైదరాబాద్ సోషల్ మీడియా గ్రూపుల్లో తనపై పోస్టులు పెడుతున్నారని, మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌లు స్పందించాలని, తనను దూరం పెట్టాలంటూ పోస్టులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

# కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తుల వెల్లువ

- ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**ముల్కనూర్ జనవరి 12( సమయం న్యూస్)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తుల సందడితో కొనసాగుతున్నాయి. ఈ జాతర ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 9న ప్రారంభమైన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10న స్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారని మంత్రి తెలిపారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు హాజరయ్యారని చెప్పారు. ఈ నెల 9 నుంచి 18 వరకు కొనసాగనున్న బ్రహ్మోత్సవాలకు నాలుగు నుంచి ఐదు లక్షల వరకు భక్తులు హాజరవుతారనే అంచనా ఉందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ప్రత్యేక, ధర్మ, వీఐపీ, అభిషేక దర్శనాలకు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలువ పందిళ్లు, తాగునీటి వసతి, తీర్థ స్నానాల కోసం నీటి సదుపాయాలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణం అంతటా విద్యుత్ దీపాలతో అలంకరణ చేపట్టామని చెప్పారు. ఆలయ కూడలి వద్ద రూ.20 లక్షల వ్యయంతో



నిర్మించిన త్రిశూలాన్ని ఈ నెల 10న ప్రారంభించామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 350 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారని తెలిపారు. పరిశుభ్రత కోసం సుమారు 150 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించామని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో షిఫ్టుల వారీగా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఆలయం పరిసరాల్లో 30 సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోం దన్నారు. భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో వేములవాడ నుంచి అదనంగా 8 కోడెలను తెప్పించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారని, భక్తులు అధిక సంఖ్యలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారిని దర్శించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

**ఆలయ విశిష్టత**

కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం ప్రముఖ శైవ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో ఉన్న ఈ ఆలయం పురాతన చారిత్రాత్మక శైవ క్షేత్రం. విశాల ప్రాంగణం, ప్రాకార మండపం, రాజగోపురాలు, ఈశాన్య భాగంలో పుష్కరిణి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కొండ పైభాగంలో సప్తకోనేరులతో ఆలయం ఆహ్లాదకర వాతావరణంలో దర్శనమిస్తుంది. కాకతీయ రుద్రేశ్వరుల కాలానికి చెందిన ఈ ఆలయం క్రీ.శ.1600 ప్రాంతంలో కేదారి పండితునిచే శైవాగమానుసారంగా ప్రతిష్టించబడినట్లు పురాణ గాథలు చెబుతున్నాయి. అప్పటి నుంచి నేటి వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నవాహ్నికంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. మకర సంక్రాంతి సందర్భంగా జరిగే జాతరలో లక్షలాది భక్తులు పాల్గొంటారు. బ్రహ్మోత్సవాల్లో మకర సంక్రాంతి రోజున స్వామివారి సర్వాలంకార నిజదర్శనం చేస్తే సర్వపీడల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. జాతర ముగింపు రోజున అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించగా, వందలాది భక్తులు అగ్నిగుండాల్లో నడిచి తమ మొక్కులు చెల్లిస్తారు. వీరభద్ర స్వామి, భద్రకాళి దర్శనంతో రోగబాధలు, ఉపద్రవాలు తొలగుతాయని భక్తులు నమ్ముతారు.

# ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవం

**సూర్య పేట జనవరి12( సమయం న్యూస్).**

ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంతి వర్యులు రేవంత్ రెడ్డి గారు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు, ఎస్.సి. మరియు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్, వికలాంగుల కాపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్ గారు, డైరెక్టర్ శైలజ వర్చువల్ గా, జిల్లా నందు జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ రావు గారు ప్రణామ్ వయో వృద్ధుల డే కేర్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వయో వయోవృద్ధులు ఒంటరి తనంతో బాధపడుతున్నారని, మానసికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి కాలక్షేపం కొరకు డే కేర్ సెంటర్ నిర్వహించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. డే కేర్ సెంటర్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నడుస్తుందని, సీనియర్ సిటిజన్స్ కొరకు డే కేర్




సెంటర్ నందు టీవీ, ఇండోర్ గేమ్స్, లైబ్రెరీ, విశ్రాంతి తీసుకొనుటకు సౌకర్యాలు కల్పించామని, స్నాక్స్, పండ్లు అందించబడినని, వయో వృద్దులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని, ప్రణామ్ వయో వృద్ధుల డే కేర్ సెంటర్ జిల్లా సంక్షేమ శాఖ మరియు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నడపబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు విద్యాసాగర్, హమీద్ ఖాన్, రెడ్ క్రాస్ చైర్మన్ కోటేశ్వరి, పెద్దిరెడ్డి గణేష్ రెడ్ క్రాస్ జిల్లా ట్రెజరర్, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ తోట శ్యామ్, గూడ రమేష్,రమాదేవి, బైరూ వెంకన్న, డాక్టర్ దుర్గాబాయి, శశిధర్, మీలా మహదేవ్, పొనుగోటి నిర్మల యూత్ రెడ్ క్రాస్ ఈశ్వర్ చంద్ర, పి భాస్కర్, సౌమ్య, వినోద్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి

- ఎంపీ కడియం కావ్య
- యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ పాఠశాల భూమి పూజ

**జాఫర్ ఘడ్ జనవరి12( సమయం న్యూస్)**



జఫర్ గడ్ మండలం కొనాయిచలం గ్రామ సమీపంలో నిర్మించబోయే యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, శాసనసభ్యులు కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఈడబ్ల్యుఐడీసి ఎండీ గణపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ విద్యే సమాజాన్ని మార్చే శక్తి అని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ పాఠశాలల భావనను ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే సంకల్పంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ పాఠశాలల ద్వారా ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, క్రీడా సౌకర్యాలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దీని వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే సామర్థ్యం మెరుగవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతుందని స్పష్టం చేశారు. భవన నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ పాఠశాలలు రాష్ట్ర విద్యా రంగంలో మైలురాయిగా నిలుస్తాయని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు కడియం శ్రీహరిపై పెట్టుకున్న నమ్మకాన్ని మరింత మించి అభివృద్ధి పనులు సాగుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. ఈ నియోజకవర్గం విద్య, వైద్య రంగాలకు కేరాఫ్‌గా మారుతోందని తెలిపారు. తన ఎంపీ నిధులను కూడా ఎక్కువగా స్టేషన్ ఘనపూర్ అభివృద్ధికే వినియోగిస్తున్నట్లు చెప్పారు. అలాగే స్టేషన్ ఘనపూర్ రైల్వే స్టేషన్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను రూ.200 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో, కార్పొరేట్ స్థాయిని మించే విధంగా నిర్మించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కావలసిన అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ పాఠశాలలను 18 నెలల్లో పూర్తి చేసేలా నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. 2027–28 విద్యా సంవత్సరానికి నియోజకవర్గ ప్రజలకు బహుమతిగా అందించే విధంగా నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. ఈ భవనంలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకు చెందిన నాలుగు గురుకుల పాఠశాలలు ఒకే చోట ఏర్పాటు కానున్నాయని చెప్పారు. ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నందున ఈ ఇంటిగ్రెటెడ్ పాఠశాలను బాలికలకు కేటాయించాలని కలెక్టర్, ఎండీని కోరారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేస్తూ, తన హయాంలోనే అధిక సంఖ్యలో గురుకుల పాఠశాలలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1650 నుంచి 1700 గురుకుల పాఠశాలలు ఉండగా, దాదాపు పది లక్షల మంది పేద పిల్లలు నాణ్యమైన విద్య పొందుతున్నారని చెప్పారు. ఈ విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల పిల్లలతో పోటీపడి అనేక ఉద్యోగాలు సాధిస్తున్నారని అన్నారు. జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలవబోతుందని అన్నారు. జనగామ జిల్లాలో మొట్ట మొదటగా ఇంటిగ్రెటెడ్ పాఠశాల మంజూరు కావడం ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషితోనే సాధ్యమైందని తెలిపారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీ పేద కుటుంబాల పిల్లలు ఒకే చోట చదువుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆర్డీవో వెంకన్న, ఈడబ్ల్యుఐడీసి, విద్యా శాఖ అధికారులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





## స్వామి వివేకానంద బోధనలు

# యువతకు మార్గదర్శకం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ భూపాల పల్లి జనవరి12( సమయం న్యూస్):**

యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించడంలో స్వామి వివేకానంద బోధనలు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. సోమవారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత లక్ష్యసాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని, సమాజ సేవను తమ జీవిత లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివేకానందుని ఆలోచనలు నేటి యువతకు దిశానిర్దేశకమని, విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల ద్వారా సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , యువజన సర్వీసులు క్రీడల శాఖ అధికారి రఘు, ఆర్డీఓ హరికృష్ణ, యువజన సర్వీసులు శాఖ సిబ్బంది సాగర్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు భద్రత పై అవగాహన

**మహబూబాబాద్ జనవరి12( సమయం న్యూస్):**

రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ & జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ వాహన డ్రైవర్లకు హెల్మెట్ వాడకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ లను వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలం లలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు... ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి షాలినీ షకేలీ అన్నారు.. ఈ కార్యక్రమములో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ సాయి చరణ్, వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ ఐ అరుణ్ నిర్వహించరు



## జిల్లా కలెక్టర్ ను కలిసిన

# అధికారుల బృందం

**నారాయణ పేట జనవరి 12( సమయం న్యూస్):**

నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ను సోమవారం జిల్లా అధికారుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు డీఆర్డీఏ మొగులప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, మిషన్ భగీరథ ఈఈ రంగారావు, డీపీఆర్వో రషీద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, అర్ అండ్ బి ఈ ఈ రమణయ్య, పీఆర్ డిప్యూటీ ఈఈ జబ్బార్ కలెక్టర్ కు పూల మొక్కను మరియు నోట్ బుక్స్ అందజేసి నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరికీ నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా అభివృద్ధి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని అన్నారు. నారాయణపేట జిల్లా రాష్ట్రంలోని ఆదర్శ జిల్లాగా అన్ని రంగాలలో ముందుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డిప్యూటీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణి కుమార్ పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన కలెక్టర్, అధికారులు
- ప్రజావాణి కార్యక్రమానికి 110 అర్జీలు

**హనుమకొండ జనవరి12( సమయం న్యూస్ ):**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు పఅత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, అధికారుల తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను నేరుగా కలిసి విన్నవిస్తూ అర్జీలను అందజేశారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తూ వారు చెప్పిన అంశాలను కలెక్టర్ ఓపికగా విన్నారు. అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు మండలాల తహసిల్దార్లతోనూ ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం 110 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పిసిపిఎన్డిటి యాక్ట్ పై అవగాహన కల్పించాలి

- పోలీస్ మెడికల్ సంబంధిత విభాగాలు నిత్యం తనిఖీలు నిర్వహించాలి
- ఇన్చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో,

**మహబూబాబాద్ జనవరి12( సమయం న్యూస్):**




గర్భస్త పూర్వ మరియు పిండ లింగ నిర్ధారణ చట్టం 1994 పై జిల్లా స్థాయి సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో డాక్టర్ రవి రాథోడ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, కమిటీ ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో హాజరై మాట్లాడుతూ

మహబూబాబాద్ లింగ నిర్ధారణ, బాలికల పట్ల వివక్షత, MTP చట్టం గురించి ఇతర ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంధ సంస్థలతో కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. గర్భిణీ స్త్రీలు పరీక్షల నిమిత్తం, లింగ నిర్ధారణ కోసం, అబార్షన్ కోసం అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్లి తమ ప్రాణాలకు ప్రమాదం కొని తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు. MTP చట్టం ప్రకారం ప్రత్యేక పరిస్థితులలో అర్హులైన వారికి అబార్షన్ కి గుర్తింపు పొందిన ఆసుపత్రులలో అవకాశం కల్పించిందన్నారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ గైనకాలజిస్ జిల్లాలో గుర్తింపు లేని, అర్హత లేని వ్యక్తులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, MTP కిట్స్ ద్వారా అబార్షన్ కు ప్రయత్నించడం వంటి విషయాలపైన ఆవేదన వ్యక్తం చేస్తూ అటువంటి వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టం నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని ఎవరైనా అప్పటికే అమ్మాయిలను కలిగి ఉండి తిరిగి పుట్టబోయే బిడ్డ ఆడ, మగ తెలుసుకోవడానికి వస్తే వారి వివరాలను తెలియజేయాలని పిహెచ్‌సి సిబ్బంది తమ పరిధిలోని గర్భిణీ స్త్రీలను ఫాలోఅప్ చేయాలన్నారు. ఆశ, ఏఎన్ఎం, స్వయం సహాయక బృందాలకు క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన ప్రచారం నిర్వహించాలని, అక్రమంగా యాక్ట్ ను ఉల్లంఘించిన వారిపై జరిమానాలు కేసులు నమోదు చేయాలని సూచించారు. అడ్వైసరీ కమిటీ సభ్యులు డాక్టర్ జగదీశ్వర్, డీఎస్పీ తిరుపతిరావు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ జిల్లాలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల లో ప్రత్యేక శ్రద్ద వహించి క్షేత్ర స్థాయి సిబ్బందితో తరుచుగా సమీక్షా సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చట్టం ఉల్లంఘిస్తున్న వారి వివరాలు 104,1098 లేదా డయల్ 100 కి తెలియచేయాలన్నారు.

ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు జిల్లాలో రిజిస్టర్ కానీ సెంటర్లను గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జగదీశ్వర్, మహబూబాబాద్ డిఎస్పి తిరుపతిరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, డిపిఆర్ఓ పి.రాజేంద్ర ప్రసాద్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె. ప్రసాద్, రాజు , మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో రైతుల ట్యాబ్ ఎంట్రీ లో

# జాప్యం సహించేది లేదు



- అధికారులకు హెచ్చరించిన జిల్లా అదనపు కలెక్టర్

**భూపాల పల్లి జనవరి 12( సమయం న్యూస్):**

ధాన్యం కొనుగోలు పూర్తయిన వెంటనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్యాబ్ ఎంట్రీలు సకాలంలో నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ హెచ్చరించారు. సోమవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, సహకార శాఖ, డిఆర్డీఏ అధికారులు మరియు కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిల్వలు, రవాణా, చెల్లింపుల వ్యవస్థలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రైతులకు ధాన్యం విక్రయానికి సంబంధించి ఎలాంటి ఆలస్యం లేదా అవకతవకలు జరగకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

ట్యాబ్ ఎంట్రీలలో ఆలస్యం జరిగితే రైతులకు చెల్లింపులు ఆలస్యం అవుతాయని, అందువల్ల ప్రతి కొనుగోలు కేంద్రంలో రోజువారీగా డేటా నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, రైతులకు అనుకూల వాతావరణంలో సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు పూర్తి అయిన కేంద్రాలను మూసి వేయాలని సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రాములు, డిఆర్డిఓ బాలకృష్ణ, సహకార అధికారి వాలియ నాయక్, కొనుగోలు కేంద్రాలు ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## పండుగ సీజన్ భద్రతా చర్యలపై సమీక్షా

**సికింద్రాబాద్ జనవరి 12( సమయం న్యూస్):** రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రత మరియు పండుగ సీజన్‌లో ప్రయాణీకుల రద్దీని నిర్వహించడంపై సమీక్ష నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గారు రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రత మరియు పండుగ రద్దీని నిర్వహించడంపై కోసం తీసుకోవలసిన చర్యలపై సమగ్ర సమీక్షా సమావేశాన్నిఈ రోజు అనగా 12 జనవరి, 2026న సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ శ్రీ సత్య ప్రకాష్ గారు, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం 6 డివిజన్లు అనగా సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు మరియు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. రాబోయే సంక్రాంతి పండుగ సీజన్ దృష్ట్యా రైల్వే స్టేషన్లు మరియు ఆన్‌బోర్డ్ రైళ్లలో రద్దీని క్రమబద్దీ కరణ మరియు నిర్వహణ సన్నాహాలపై శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రధానంగా దృష్టి సారించారు. క్షేత్ర స్థాయి సూపర్‌వైజర్లు మరియు అధికారులు, ప్రయాణీకుల రాకపోకలను సాఫీగా సాగించడానికి బుకింగ్ కౌంటర్ల వద్ద మరియు బోర్డింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండడానికి, ప్రయాణీకుల మార్గదర్శకత్వం కోసం తగినంత ఆర్.పి.ఎఫ్ అదనపు సిబ్బందిని మోహరించాలని ఆదేశించారు. అంతేకాకుండా, పండుగ సీజన్ లో సురక్షితమైన మరియు క్రమబద్ధమైన ప్రయాణాన్ని సులభతరం చేయడానికి రెగ్యులర్ మరియు స్పెషల్ రైళ్లపై సకాలంలో ప్రకటనలు మరియు సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన హైలైట్ చేశారు. శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రైల్వే ప్రాంగణంలో పరికరాల నిర్వహణ, అగ్నిమాపక భద్రతా చర్యలను, క్రమం తప్పకుండా తనిఖీలు మరియు కఠినమైన భద్రతా మార్గదర్శకాలను పాటించడంపై సమీక్షించారు. పండుగ సీజన్‌లో సురక్షితమైన మరియు ఆహ్లాదకరమైన ప్రయాణాలకోసం , ప్రయాణీకులు మరియు సిబ్బంది భద్రతా చర్యలను ఖచ్చితంగా పాటించాలని జనరల్ మేనేజర్ సూచించారు



## కలెక్టరేట్ లో ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

**నిర్మల్, జనవరి12( సమయం న్యూస్):** ఆదివారం కలెక్టరేట్ లో నీ సమావేశం మందిరంలో వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు, సంఘ నాయకులు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలను వేసి అంజలి ఘటించారు. పలువురు మాట్లాడుతూ, పీడిత వర్గాల హక్కుల కొరకు పోరాడిన గొప్ప వ్యక్తి ఓబన్న అని తెలిపారు. వడ్డెర జాతి వారు ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలో ఉన్నప్పుడు రేనాటి పాలెగాళ్లకు, కంపెనీ పాలెగాళ్లకు చెల్లించే జీతభత్యాలు విషయంలో మొదలైన సంఘర్షణ సాయుధ పోరాటంగా మారుటలో ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయిధ పోరాటానికి వడ్డే ఓబన్న సైన్యాధ్యక్షునిగా వ్యవహరించారన్నారు. ఇటువంటి పోరాట యోధుల జయంతిని అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని తెలిపారు. ఇటువంటి వ్యక్తుల జయంతులను అధికారికంగా నిర్వహించడం ద్వారా నేటి తరాలకు వారి పోరాట గాధల్ని తెలిపిన వారిమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, సంఘ నాయకులు, ఇతర అధికారు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జనవరి 12, (సమయం న్యూస్):** జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల ప్రక్రియలో బాల కార్మికులను
## వినియోగిస్తే కఠిన చర్యలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల జనవరి 12,( సమయం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో బాల కార్మికులను వినియోగిస్తే ఎన్నికల సంఘం, బాలల పరిరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోడప్రతుల అతికింపు, ఫ్లెక్సీల ఏర్పాటు, కరపత్రాల పంపిణీ, ప్రచార సమయంలో ప్ల కార్డుల ప్రదర్శన, సభలలో, సమావేశాలలో బాలబాలికలచే పనులు చేపించినా, బాల కార్మికుల ప్రమేయం కనిపించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిబంధనలను అనుసరించి సజావుగా సాగేలా సహకరించాలని తెలిపారు.



## శ్రీవశిష్ఠ స్కూల్ లో జాతీయ యువజన దినోత్సవం

**యాలాల మండలం, జనవరి,12(సమయం న్యూస్):**

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శ్రీవశిష్ఠ స్కూల్ లో ఘనంగా జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా షటిల్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది.ఇందులో '18' టీమ్ లు పాల్గొన్నాయి. ఇందులో రాములు, ఓంకార్ విన్నర్స్ గా నిలిచారు. రాంప్రసాద్ ,మహేష్ రన్నర్స్ గా నిలిచారు. విరికి బహుమతులు ప్రధానం చేయడానికి ముఖ్య అతిథులుగా అగ్గనుర్ గ్రామ సర్పంచ్ మంజుల భీమప్ప మరియు యాలాల్ మండల యూత్ ప్రెసిడెంట్ వీరేశం, బెన్నూరు ఉప సర్పంచ్ రఘు యూత్ వైస్ ప్రెసిడెంట్ రఫిక్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీవశిష్ఠ స్కూల్ కరెస్పాండెంట్ హరికృష్ణ, పి శ్రీనివాస్, ఇన్చార్జి జి నరేష్ పాండు సిద్దు, ఏం శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

- ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దు
- మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, జనవరి-12( సమయం న్యూస్):**

పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సోమవారం మంథని ప్రాంతంలో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంథని శివ కిరణ్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తమ హయాంలో పెద్ద ఎత్తున పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. నేడు మరో 317 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేయడం సంతోషకరమని తెలిపారు. ఎల్2 లబ్ధిదారులుగా ఎంపికైన 298 దరఖాస్తులు, ఎల్3 దరఖాస్తులను పరిశీలించి మరో 300 మంది ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎల్1 కేటగిరీలో ఎంపికైన లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.5 లక్షల ప్రభుత్వ సహాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని, అవినీతికి ఎలాంటి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. 317 మంది లబ్ధిదారులు ఐదు నెలల్లో ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి వారం నిధులు విడుదల చేస్తోందని, ఇంటి నిర్మాణానికి అవసరమైన సహాయం కోసం అధికారులు, స్థానిక నాయకులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని తెలిపారు. మంథనిలో ఉన్న పేదలందరికీ విడతల వారీగా తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ మరో రెండు నుంచి మూడు నెలల్లో నూతన ఫించన్ల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంథని పట్టణంలో రూ.37 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేశామని చెప్పారు. మంథని పట్టణంలో రూ.10 కోట్ల వ్యయంతో అన్ని వర్గాల కోసం కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనుల కోసం మరో రూ.22 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. మంథని ఆర్టీసీ డిపో నుంచి పాత పెట్రోల్ బంక్ వరకు రోడ్డు విస్తరణకు రూ.15 కోట్లు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.కోటి 20 లక్షలు, అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం వరకు రోడ్డు వెడల్పు పనులకు రూ.50 లక్షలు, బోక్కల వాగు ఇరువైపులా లైటింగ్‌కు రూ.30 లక్షలు, శ్రీపాద కాలనీ నుంచి పోచమ్మ గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి వివరించారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు తావులేకుండా అభివృద్ధి, సంక్షేమమే సమాధానంగా ఉండాలని మంత్రి హితవు పలికారు. పేద ప్రజలకు శాచురేషన్ పద్ధతిలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి కుటుంబ సభ్యులందరికీ నెలకు ఆరు కిలోల సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుతో జీరో బిల్ అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. మంథని పట్టణంలోని ఆటో కార్మికుల కోసం ఆటోనగర్ ఏర్పాటు దిశగా అవసరమైన భూమిని గుర్తించే ప్రక్రియ చేపట్టామని, త్వరలోనే స్థలాల పంపిణీ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు మంత్రి మంథని కుచిరాజుపల్లిలో రూ.4.5 కోట్లతో నిర్మించనున్న ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్, రూ.20 లక్షలతో బస్టాండ్, రూ.30 లక్షలతో ఈద్గా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంథని పట్టణ పరిధిలో రూ.8 కోట్ల 5 లక్షల వ్యయంతో చేపట్టిన 28 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎరుకల గూడెం రోడ్డు నుంచి సీఆర్కే అపార్ట్‌మెంట్స్, అయ్యప్ప టెంపుల్ రోడ్డు వరకు రూ.కోటి 89 లక్షలతో నిర్మించిన రోడ్డు పనులను, పాత అబ్కారీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. పెంచికల్‌పేట నుంచి కమాన్‌పూర్ రోడ్డు వరకు రూ.14 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు, రూ.3 కోట్లతో గుడదం రాజాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి, రూ.10 లక్షలతో గంగాపురి బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అధికారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కుమారస్వామి, పీడీ హౌసింగ్ రాజేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పని ప్రదేశాల్లో మహిళల రక్షణే ధ్యేయం



- పోష్ చట్టంపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలి
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ జనవరి12( సమయం న్యూస్)**

ప్రతి మహిళకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడమే పోష్ చట్టం ఉద్దేశమని, ఈ చట్టం పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధం, పరిష్కారం, పోష్ చట్టం (POSH Act) అమలుపై జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మహిళ పోష్ చట్టం పై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వ్యవసాయ క్షేత్రాలు, ఇళ్లలో, ఇతర పనిచేసే మహిళలకు లైంగిక వేధింపుల నుండి రక్షణ లభిస్తుందన్నారు. ప్రతి సంస్థలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసి నోటీస్ బోర్డులో ఉంచాలని, ఉద్యోగులకు ఈ చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలనీ అన్నారు. ఈ కమిటీని ఏర్పాటు చేయకపోయినా లేదా చట్టాన్ని పాటించకపోయినా యజమానికి రూ. 50 వేల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. బాధితులు లైంగిక వేధింపులు జరిగిన నాటి నుండి 3 నెలల లోపు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చనీ, విచారణను 90 రోజుల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుందనీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పోర్టల్ https:// shebox.wcd.gov.in ద్వారా బాధితులు నేరుగా తమ ఫిర్యాదును నమోదు చేసుకోవచ్చనీ అన్నారు. జిల్లాలో అంతర్గత కమిటీ లేని సంస్థల కోసం అసంఘటిత రంగ కార్మికుల కోసం "లోకల్ కమిటీ" అందుబాటులో ఉందనీ, మహిళలు తమ సమస్యల పరిష్కారానికి 181 ఉమెన్ హెల్ప్‌లైన్‌ను సైతం ఆశ్రయించవచ్చని తెలిపారు. అనంతరం పోష్ చట్టం పుస్తకాన్ని కలెక్టర్, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, డిఆర్డీఓ రవీందర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## సంక్రాంతి పండుగకు సెలవులకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి:

**మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి**

**మక్తల్ మున్సిపల్, జనవరి,12(సమయం న్యూస్)**



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాలు, పట్టణాల నుంచి పలువురు తమ స్వగ్రామాలకు, విహారయాత్రలకు వెళ్లనున్న నేపథ్యంలో ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడు తూ... సెలవులకు వెళ్లే ముందు ఇంటి తెలుపులు, కిటికీలు సక్రమంగా లాక్ చేయాలని, విలువైన వస్తువులు, నగదు, బంగారు ఆభరణాలను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటి వద్ద వెలుతురు కోసం టైమర్ లైట్లు ఏర్పాటు చేయడం, నమ్మకమైన పొరుగువారికి సమాచారం ఇవ్వడం, అవసరమైతే సీసీ టీవీ కెమెరాలను అమర్చుకోవడం వంటివి దొంగతనాల నివారణకు ఉపయోగపడతాయని పేర్కొ న్నారు.అలాగే, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100/112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పండుగ రోజులలో పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా, పట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీసులతో సహకరించి అప్రమత్తంగా ఉంటేనే దొంగతనాలు పూర్తిగా నివారించవచ్చని అన్నారు.మక్తల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాలలో పండుగ కాలంలో అదనపు పట్రోలింగ్ ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో గస్తీ పెంచామని, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి స్పష్టం చేశారు.

## హనుమకొండ జిల్లా ధర్మారం గుట్టలో యువకుడి అనుమానాస్పద మృతి



**హనుమకొండ జనవరి12( సమయం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారం గుట్టలో పిట్టల అశోక్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలిస్తున్నారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.



## మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జనవరి12( సమయం న్యూస్):**

త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికలకు మున్సిపల్ అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులు ,మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. వార్డులు, వార్డులలో పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, వార్డుల వారీగా ఓటర్ లిస్టులు, ఓటర్ డ్రాఫ్ ను , ఆరోలు ఏఆర్వోలు, మున్సిపల్ ఎన్నికల సిబ్బంది అంతా ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ వారీగా మున్సిపల్ కమిషనర్లను ఎన్నికల ఏర్పట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



## ఐలయ్యకు తెలుగు సాహిత్య మంజరి జాతీయ పురస్కారం

**ఖమ్మం, జనవరి 12 (సమయం న్యూస్):** స్థానిక రచయిత పంజాల ఐలయ్యకు తెలుగు సాహిత్య మంజరి జాతీయ పురస్కారం లభించింది. ఆదివారం భద్రాచలం సీతారామ కమ్మ సేవ సత్రంలో తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ , ఉషోదయ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు తాళ్లూరి పంచాక్షరయ్య, బూసి రెడ్డి శంకర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది జి.జగదీశ్వరరావు ప్రసాద్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ధనాసి ఉషారాణి, మేనేజింగ్ డైరెక్టర్ యు వి రత్నం ,వి డి ఎం ప్రసాద్చేతుల మీదుగా పంజాల ఐలయ్యకు తెలుగు సాహిత్య మంజరి జాతీయ పురస్కారంఅందజేశారు. పలువురు రచయితలు, కళాకారులు, ఉద్యోగులు అభినందనలు ప్రకటించారు.

## బాధిత కుటుంబానికి చేయూత



**రాయపోల్, జనవరి 12:** రాయ పోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన బంధారం మల్లయ్య మృతి విషయం తెలుసుకున్న వెంటనే ఆయన కుటుంబానికి దండు స్వామి సోమవారం 50కిలోల బియ్యాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా దండు స్వామి మాట్లాడుతూ, పేదలు ఎవరైనా సరే వారి కష్టసుఖాల్లో భాగస్వాములై, ప్రజలకు తోడుగా అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. తన వంతుగా సహాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుండి సేవ చేస్తానని ఆయన అన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన వార్డు సభ్యులు దయ్యాల పోచయ్య, గంగి నర్సిములు, పడిగే మల్లేశం, మన్నె చిరంజీవి, పడిగే కృష్ణ, వరద సంతోష్, బంధారం రవికుమార్‌లను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బంధారం సంతోష్‌తో పాటు పలువురు గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఈ సేవాభావాన్ని గ్రామ ప్రజలు ప్రశంసించారు.

## ప్రజావాణికి 20 ఫిర్యాదులు.

### ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్-సిక్తా పట్నాయక్



**నారాయణపేట, జనవరి,12(సమయం న్యూస్):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 20ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ ఆఫీస్ను అందరూ అధికారులూ అప్డేట్ చేసుకోవాలి అని కలెక్టర్ అధికారులనూ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను డిప్యూటీ కలెక్టర్ లు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి



**పరిగి మున్సిపల్, జనవరి,12(సమయం న్యూస్):** పరిగి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఆసుపత్రి కమిటీ సమావేశంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలు, సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం రూ.27 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే టిఆర్ఆర్ స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



**ఖమ్మం, జనవరి 12: ( సమయం న్యూస్ ):** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఖమ్మం సారధి నగర్ కు చెందిన ఎస్.కే. అతిర్ 48వ డివిజన్ పరిధిలో తమ ఇంటి ప్రక్కన అనధికారీకంగా కారం, పిండీ మిల్లు నడుపుతున్నారని, దీనివల్ల తమ ఇంట్లో కుటుంబ సభ్యులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, కాలనీ యందు ఉన్న ఈ మిల్లును మార్చాలని దరఖాస్తు చేసుకోగా, ఈఈ పీసీబీకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. వైరా పట్టణం శాంతినగర్ కు చెందిన కే. వేంకటేశ్వర్లు తనకు 69 సంవత్సరాల వయస్సు ఉందని, వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామానికి చెందిన కే. రమేష్ సిద్ధారం గ్రామానికి సంబంధించిన రేషన్ షాప్ డీలర్ పోస్ట్ ఖాళీగా ఉన్నట్టు తెలిసిందని, తనకు అర్హత ఉన్నందున ఆ పోస్ట్ మంజూరు చేయాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కల్లూరు సబ్ కలెక్టర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. మధిర మండలం చిలుకూరి గ్రామ నివాసులు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపును రద్దు చేయాలని దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## పోట్రు మనోజ్ కళ్యాణ్, ఉడతనేని వికాస్ ముఠా

# 547 కోట్ల సైబర్ దోపిడీ





- అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్థులతో జతకట్టి విదేశాలలో కాల్ సెంటర్ల ద్వారా మోసం
- 24 మందిపై కేసు నమోదు, కేసులో మొత్తం 18 మంది అరెస్టు
- ఖమ్మం పోలీస్ కమిషనర్

**ఖమ్మం, జనవరి 12 (సమయం న్యూస్):** సైబర్ నేరాలకు పాల్పడడం ద్వారా ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన పోట్రు మనోజ్ కళ్యాణ్, ఉడతనేని వికాస్ చౌదరి అండ్ ముఠా దోపిడీ చేసిన నగదు మొత్తం రూ.547 కోట్లుగా ఖమ్మం జిల్లా పోలీసులు తేల్చారు. ఈ ముఠా సైబర్ దోపిడీకి సహకరించిన మొత్తం 18 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పెనుబల్లి పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సీపీ సునీల్ దత్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గత నెల 24వ తేదీన సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన మోదుగ సాయికిరణ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపారు.నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన పేరుతో వలవిసిరి ఉడతనేని వికాస్ చౌదరి, పోట్రు మనోజ్ కళ్యాణ్, పోట్రు ప్రవీణ్, మేడ భానుప్రకాష్, మేడా సతీష్, మొరంపూడి చెన్నకేశవ అనే వ్యక్తులు సైబర్ నేరాలకు పాల్పడడం ద్వారా రూ. 547.00 కోట్ల భారీ మొత్తాన్ని కొల్లగొట్టారని గుర్తించామన్నారు. కేసు విచారణలో భాగంగా నిందితులైన ఉడతనేని వికాస్ చౌదరి, పోట్రు మనోజ్ కళ్యాణ్ ల కుటుంబ సభ్యుల, అనుచరుల బ్యాంక్ అకౌంట్లను పోలీసులు పరిశీలించగా దిగ్భ్రాంతి కలిగించే అంశాలు వెల్లడయ్యాయి. పోట్రు మనోజ్ కళ్యాణ్ బ్యాంకు ఖాతాలో రూ. 114.18 కోట్లు, అతని భార్య మేడా భానుప్రియకు చెందిన రెండు బ్యాంకు ఖాతాల్లో రూ. 45.62 కోట్లు, మనోజ్ కళ్యాణ్ బామ్మర్ది అయినటువంటి మేడా సతీష్ ఖాతాలో రూ. 135.48 కోట్లు, బొమ్మిడాల నాగలక్ష్మి ఖాతాలో రూ. 81.72 కోట్లు, కరీంనగర్ కు చెందిన తాటికొండ రాజు అనే వ్యక్తికి చెందిన నరసింహా కిరాణం అండ్ డెయిరీ ఖాతాలో రూ. 92.54 కోట్లు, ఉడతనేని వికాస్ చౌదరి ఖాతాలో రూ. 80.41 కోట్ల చొప్పున లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సత్తుపల్లి పరిసర గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువకులను ఉద్యోగాల కల్పన పేరుతో పిలిపించుకుని, వారికి ఉద్యోగం ఇచ్చి, వారితో ప్రముఖ బ్యాంకుల్లో ఖాతాను తెరిపించి, ఆయా అకౌంట్లలో క్రెడెన్షియల్స్ ను తీసుకుని నిందితులు కోట్ల రూపాయల సైబర్ క్రైమ్ నేరాల సొత్తును జమ చేయడానికి వినియోగించారు. ఈ నేరస్తులు అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్థులతో జతకట్టి విదేశాలలో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ వాటి ద్వారా దేశంలోని పౌరులకు పెట్టుబడి, మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్లో పెట్టుబడులు మరియు క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో మోసగించి, ఎవరైనా బాధితుడు వారి మాటలకు ఆకర్షించబడితే అతనిని వారి టెలిగ్రామ్ గ్రూపులలో సభ్యునిగా చేర్చి, తర్వాత వారికి మోసపూరిత లింకులు పంపి వారి అకౌంట్లో నుండి డబ్బులను ఖాళీ చేయడం జరుగుతుంది. వీరు మొదట సైబర్ క్రైమ్ ద్వారా వచ్చిన నేరపు సొత్తును, వీరి ఏజెంట్ల ద్వారా తెరిపించిన బ్యాంక్ అకౌంట్లోకి బదిలాయించేవారు. తర్వాత సొమ్మును కొన్ని కరెంట్ ఎకౌంట్లోకి మార్చి, చివరగా తమ పర్సనల్ ఎకౌంట్లోకి అట్టి డబ్బులు చేర్చి, యూఎస్ డాలర్ , క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చినట్టుగా తేలినది. ఇట్టి కేసు విచారణలో భాగంగా మొదట పోట్రు ప్రవీణ్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడం జరిగినది. అలాగే నిందితుల బ్యాంక్ అకౌంట్లో సహాయంతో వారికి ఎకౌంట్లు ఇచ్చి సహకరించిన పలువురు వ్యక్తులను మరియు అకౌంట్స్ ను గుర్తించడం జరుగుతున్నది. క్షేత్రస్థాయిలో కేసు దర్యాప్తు కొనసాగుతుందని నిందితులేవరిని ఉపేక్షించేది లేదని చట్టపకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ తెలిపారు.సైబర్ నేరగాళ్ళ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని అత్యాశకుపోయి కేసుల్లో ఇరుకోవద్దని సూచించారు.ఈ సైబర్ నేరాల రాకెట్‌లో నిందితులకు సహకరించినందుకు సదాశివపాలెం, సీతారాంపురం, రామానగరం, తుమ్మూరు గ్రామాలకు చెందిన జుంజునూరి శివక్రిష్ణ, వడ్లమూడి నరేంద్ర, మల్లాది శివ, సాధు పవన సందీప్, సాదు సంధ్య, సాధు లేఖలను అరెస్ట్ చేశారు. అదేవిధంగా లింగపాలెం గ్రామానికి చెందిన జొన్నాదుల తిరుమల, కందుకూరి మణికంఠ, తన్నీరు మహేష్, గోళ్లమూడి నాగముఖేష్, కంచపోగు శ్రీనివాస్, రాయల అజయ్ కుమార్, రాయల గోపి, పల్లా గణేష్, రాయల గోపిచంద్, కందుకూరి జగదీష్, కరీంగనర్ కు చెందిన తాటికొండ రాజులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో పోట్రు ప్రవీణ్ ను ఇప్పటికే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీపీ సునీల్ దత్ వివరించారు.

# డయల్ యువర్ ఎస్పీకి అనూహ్య స్పందన

### ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




**నారాయణపేట, జనవరి,12(సమయం న్యూస్):** నారాయణపేట జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ రోజు ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు, ఫిర్యాదుదారులు స్వయంగా ఎస్పీకి ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా తెలియజేశారు.మొత్తం 19 కాల్స్ రావడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు.ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు ముఖ్యంగా తమ ప్రాంతాల్లో ముందస్తు దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ పెంచాలని,భూ తగాదాలకు సంబంధించినవి, కుటుంబ కలహాలు పరిష్కరించాలని,గతంలో జరిగిన దొంగతన కేసుల్లో నిందితులను ఇప్పటివరకు పట్టుకోలేదని,దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న కానిస్టేబుల్స్‌ను ట్రాన్స్ఫర్ చేయాలని,సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరినట్లు ఎస్పీ తెలిపారు.ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును గమనించి, వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ప్రజలు ఈ విధమైన అవకాశాలను సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# కార్మిక హక్కులను రక్షించుకుందాం

**● సిఐటీయూ పిలుపు**



**యాలాల, మండలం జనవరి,12(సమయం న్యూస్):** సోమవారం యాలాల మండల కేంద్రంలో పోరు యాత్ర కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప అధ్యక్షత వహించడం జరిగింది. కార్మిక వర్గం ఐక్య పోరాటాల ద్వారా కార్మిక వర్గ హక్కులను పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పద్మశ్రీ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.కేంద్రంలోని స్థానిక కార్మిక నాయకులతో కలిసి పోరుయాత్ర కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ శ్రమశక్తి నీతి 2025 పేరుతో మోడీ ప్రభుత్వం కార్మిక విధానాన్ని ప్రకటించి, కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కోరలు లేని లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని విమర్శించారు. కొత్త కార్మిక విధానాన్ని ప్రవేశపెట్టాలనుకుంటే ముందుగా యూనియన్ ప్రభుత్వం కేంద్ర కార్మిక సంఘాల భాగస్వామ్యంతో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ నిర్వహించేదని, ఇప్పుడు అలాంటి ప్రయత్నం ఏమి చేయకపోగా కనీసం కేంద్ర కార్మిక సంఘాలను సంప్రదించకుండా అప్రజాస్వామికంగా దొడ్డిదారిన కార్మిక చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. పార్లమెంట్లో కనీస చర్చ లేకుండా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం చట్టాలను సవరించి కార్మిక వర్గ హక్కులను హరించారని విమర్శించారు.8 గంటల పని దినం, ఎనిమిది గంటల వినోదం, ఎనిమిది గంటల విశ్రాంతి అన్న నినాదాన్ని తొలగించి 12 గంటలకు పని దినాలను పెంచి కార్మికుల విశ్రాంతి వినోదాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు.మూడు షిఫ్టుల స్థానంలో డే షిఫ్ట్, నైట్ షిఫ్ట్ వచ్చి చేరాయని, ఇంట్లో పిల్లలు నిద్ర లేవక ముందే డ్యూటీకి బయలుదేరే బానిస సమాజంలోకి కార్మిక వర్గాన్ని తీసుకెళ్లారని విమర్శించారు. కాంట్రాక్టు వ్యవస్థను,వలస కార్మికులను పెంచి పోషిస్తూ కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం, వేతన చెల్లింపుల చట్టం లేకుండా చేశారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక వర్గ హక్కుల పరిరక్షణకై ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ,కే. శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. వెంకటయ్య,రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. మైపాల్,సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య,కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మల్కయ్య,వివిధ రంగాల కార్మికులు మాణిమల, మంజుల, ఆరిఫ్, శివకుమార్, ఆనందం, శ్రీనివాస్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద జయంతి .. యువతకు ప్రేరణాత్మక దినం

**డాక్టర్ దేశబోయిని నర్సింహులు**



**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 12:** గజ్వేల్‌లో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు యువజన ప్రతినిధులతో కలిసి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి భారత యువతకు అత్యంత ప్రత్యేకమైన మరియు ప్రేరణాత్మకమైన దినమని పేర్కొన్నారు.యువతే దేశ భవిష్యత్తు అని విశ్వసించిన స్వామి వివేకానంద, ఆత్మవిశ్వాసం, ధైర్యం, క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించాలని తన బోధనల ద్వారా తెలియజేశారని అన్నారు.లేచిరండిొ మేల్కొనండిొ లక్ష్యాన్ని చేరే వరకు ఆగవద్దు అన్న ఆయన సందేశం నేటికీ యువతకు మార్గదర్శకంగా నిలుస్తోందని గుర్తు చేశారు.విద్య అనేది ఉపాధి కోసం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, మానవ విలువల అభివృద్ధికి ఉపయోగపడాలని స్వామీజీ బోధించారని వివరించారు.శారీరకంగా, మానసికంగా, నైతికంగా బలమైన యువతే బలమైన భారతదేశాన్ని నిర్మించగలదని ఆయన నమ్మకం అని తెలిపారు. దేశంలోని యువత అంతా స్వామి వివేకానంద ఆశయాలు, సిద్ధాంతాలను తమ జీవితాల్లో ఆచరణలో పెట్టాలని, సమాజ సేవ, పేదల అభ్యున్నతి, జాతీయ సమైక్యతకు యువత ముందుండాలని పిలుపునిచ్చారు.స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ప్రతి యువకుడు, యువతి దేశ నిర్మాణంలో భాగస్వాములై భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు యువజనప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వివేకానంద జయంతి

**యాలాల మండలం,జనవరి,12(సమయం న్యూస్):** భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక చరిత్రలో స్వామి వివేకానందుడు ఒక మహానుభావుడు.1863 జనవరి 12న కలకత్తాలో జన్మించిన ఆయన,రామకృష్ణ పరమహంసుల శిష్యుడిగా ఆధ్యాత్మిక జ్ఞానంతో పాటు మానవ సేవనే పరమ ధర్మంగా భావించారు.1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మత మహాసభలో ఆయన చేసిన ప్రసంగం భారతదేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పింది. “సోదరులారా, సోదరీమణులారా” అని ఆయన పలికిన మాటలు ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయి. ఆ ప్రసంగం ద్వారా భారతీయ తత్వశాస్త్రం, వేదాంతం, సహన భావనలకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది.యాలాల సొసైటీ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ అనంతయ్య జ్ఞాపకార్థం సందర్భంగా క్రీడలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారుస్వామి వివేకానందుడు యువతకు ఆత్మవిశ్వాసం, శ్రమ,కర్తవ్య నిబద్ధతను బోధించారు. “లేచిపోండి, లక్ష్యాన్ని చేరేవరకు ఆగకండి” అన్న ఆయన మాటలు నేటికీ యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయి. విద్య, సేవ, దేశభక్తి అనే విలువలను ఆయన తన జీవితంతోనే చాటిచెప్పారు.రామకృష్ణ మిషన్ స్థాపన ద్వారా విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలకు ఆయన బలమైన పునాది వేశారు. స్వామి వివేకానందుని ఆలోచనలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో యాలల్ సొసైటీ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి అగ్గనూర్ మాజీ సర్పంచ్ భీమప్ప యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వీరేశం వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అగ్గనూర్ ఉపసర్పంచ్ వెంకటయ్య వార్డు సభ్యులు యువజన సంఘం సభ్యులు ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు



## కొత్తపల్లి బస్టాండ్ వద్ద ప్రమాదకర గుంత

**వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు**




**రాయపోల్, జనవరి 12:** గజ్వేల్‌ఉరామయంపేట రహదారి ప్రక్కన ఉన్న కొత్తపల్లి రోడ్డు బస్టాండ్ సమీపంలో, కల్వర్టు దగ్గర రోడ్డుకు ఆనుకొని పెద్ద గుంత ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గుంత కారణంగా ఆ ప్రాంతంలో వాహనాలు వెళ్లేందుకు డ్రైవర్లు జంకుతున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు గుంత స్పష్టంగా కనిపించక ప్రమాదానికి గురయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఈ రహదారిని వినియోగించే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదకర గుంత వల్ల ఎలాంటి అనర్థాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఫైనల్ పబ్లికేషన్ ఓటర్ లిస్టు

**మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్**



**కొడంగల్ మున్సిపల్, జనవరి,12(సమయం న్యూస్):** కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం 11,565 ఓటర్లకు, 12 వార్డులుగా ఫైనల్ పబ్లికేషన్ ఓటర్ లిస్టు పబ్లిష్ చేయడం జరిగినట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తెలిపారు.



## పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

**యాలాల మండలం, జనవరి,12(సమయం న్యూస్):** లక్ష్మీనారాయణపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువతి, యువకులను ప్రోత్సహించే ఉద్దేశంతో రంగోలి పోటీలు మరియు పతంగుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లక్ష్మీనారాయణపూర్ ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని కూడా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుర్రాల నాగమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని డా.సి అనిల్ కుమార్ రెడ్డి,సి కృష్ణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా,జి నర్సి రెడ్డి, అడ్వకేట్ రాజవర్ధన్ రెడ్డి,రాజ్యలక్ష్మి, నరేష్, హరి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.వివేకానంద జయంతి సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యువతకు స్వామి వివేకానంద జీవితం, సందేశాలు ఆదర్శప్రాయమని, కష్టపడి చదివి సమాజానికి ఉపయోగపడేలా ముందుకు సాగాలని సూచించారు.గ్రామ మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగోలి పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల అనంతరం ఉత్తమంగా ప్రదర్శించిన వారికి ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## తాండూర్‌లో తుది ఓటర్ల జాబితా



**తాండూర్ మున్సిపల్, జనవరి,12(సమయం న్యూస్):** ఎన్నికల సంఘం ఆదేశం మేరకు తుది ఓటర్ల జాబితాను ప్రకటించడం జరిగింది.వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపాలిటీలోని (36) ఓటర్లకు సంబంధించి ఓటర్ల వారిగా ఫైనల్ ఓటర్ల జాబితాను మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమేష్, టౌన్ ప్లానింగ్ విభాగము అధికారులు వంశీధర్, నరేష్, జూనియర్ అసిస్టెంట్లు వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జనవరి12( సమయం న్యూస్) :** త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికలకు మున్సిపల్ అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులు ,మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. వార్డులు, వార్డులలో పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, వార్డుల వారీగా ఓటర్ లిస్టులు, ఓటర్ డ్రాప్ ను , ఆరోలు ఏఆర్వోలు, మున్సిపల్ ఎన్నికల సిబ్బంది అంతా ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ వారీగా మున్సిపల్ కమిషనర్లను ఎన్నికల ఏర్పట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## లద్నూర్ పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

**మద్దూరు జనవరి12( సమయం న్యూస్) :** సోమవారం మద్దూరు మండలంలోని లద్నూర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ మెడికల్ ఆఫీసర్ సెలవుల్లో ఉన్నట్లు సిబ్బంది తెలపగా అనుమతి తీసుకున్నారా అని డిఎంఅండ్ఎచ్ఓ కీ ఫోన్ ద్వారా ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్ నుండి అటెండర్ వరకూ సెలవు కావాలంటే పై అధికారి అనుమతించాకే సెలవు తీసుకోవాలని ఇష్టానుసారంగా మీకు మీరే లీవ్ లెటర్ రాసుకొని లీవ్ తీసుకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పి ఎచ్ సి లో అపరిశుభ్రంగా ఉండడం చూసి అటెండర్ పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ వేళలు పాటిస్తూ 24/7 ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మద్దూరు మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అటెండెన్స్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. పి ఎచ్ సి లో అటెండర్ లేక చాలా ఇబ్బందిగా ఉందని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తేగా సానుకూలంగా స్పందించి డిఎంఅండ్ఎచ్ఓ మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## సోఫీ షైన్‌తో శిఖర్ ధావన్ నిశ్చితార్థం!

భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన స్నేహితురాలు సోఫీ షైన్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. చాలా కాలంగా ఇద్దరూ ఒకరినొకరు డేట్ చేస్తున్నారు. మొదట్లో సీక్రెట్‌గా జరిగిన వ్యవహారాన్ని సోషల్ మీడియా ద్వారా అప్పుడప్పుడు వెల్లడిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఏకంగా వారి నిశ్చితార్థం విషయాన్ని కూడా చెప్పేశారు. తన నిశ్చితార్థం ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ అభిమానులకు ఈ శుభవార్తను అందించాడు. సోఫీ కంటే ధావన్ 5 సంవత్సరాలు పెద్దవాడు. శిఖర్ ధావన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫోటోను షేర్ చేశాడు, ఇందులో శిఖర్, సోఫీ చేతిలో నిశ్చితార్థపు ఉంగరం ఉంది. శీర్షికలో, ధావన్ ఇలా రాశాడు, "నవ్వులు పంచుకోవడం నుంచి కలలను పంచుకోవడం వరకు, మా నిశ్చితార్థం కోసం వచ్చిన ప్రేమ, ఆశీర్వాదాలు, ప్రతి శుభాకాంక్షలకు నేను కృతజ్ఞుడను, ఎందుకంటే మేము కలిసి జీవించాలని నిర్ణయించుకున్నాము." అని రాసుకొచ్చాడు.సోఫీ ఐర్లాండ్‌కు చెందిన యువతి. ఆమె ఒక ప్రోడక్ట్ కన్సల్టెంట్. ప్రస్తుతం ఆమె అబుదాబిలోని ఒక కంపెనీలో సెకండ్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె 1990లో జన్మించింది, ప్రస్తుతం ఆమె వయస్సు 36 సంవత్సరాలు. లిమెరిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మార్కెటింగ్, మేనేజ్‌మెంట్‌లో చదువు పూర్తి చేసింది. 2023లో శిఖర్ ధావన్‌కు చాలా ఇబ్బందికరమైన సమస్యలు వచ్చాయి. బ్యాడ్ టైం నడిచింది. మొదటి భార్య ఆయేషా ముఖర్జీ వివాదాలు సాగాయి. కలిసి జీవించలేమని గ్రహించి ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. కుమారుడికి దూరం కావడంతో శిఖర్ ధావన్ చాలా భావోద్వేగానికి లోనయ్యాడు. వాటిని ఏమాత్రం తనలో దాచుకోలేదు. వాటిని ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తన ఆలోచనలు పంచుకుంటూ పోస్ట్‌లు పెట్టాడు. కట్ చేస్తే ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో ధావన్ సోఫీ షైన్‌తో కనిపించి అందరికీ షాక్ ఇచ్చాడు. ఈ టోర్నమెంట్‌కు పాకిస్తాన్ ఆతిథ్యం ఇచ్చింది. కానీ భారత్ ఆ దేశం వెళ్లలేదు. తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడింది. దుబాయ్‌లోని ఒక రెస్టారెంట్‌లో సోఫీ షైన్‌ను మొదటిసారి కలిసినట్లు ధావన్ చెప్పారు. ఆ రోజున కామోఫ్లాజ్ ట్రౌజర్స్, జాకెట్‌లో సోఫీ చాలా అందంగా కనిపించిందని క్రికెటర్ చెప్పాడు. మొదటి సమావేశం గురించి మాట్లాడుతూ, ధావన్ అందమైన ముఖం, అల్లరి కళ్ళతో ఆకర్షితుడైనట్లు సోఫీ చెప్పారు.నిశ్చితార్థం చేసుకున్న శిఖర్ ధావన్ సోఫీ షైన్ కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు కూడా చేస్తున్నారు. ధావన్ అతనితో చాలా ఫన్నీ వీడియోలను షేర్ చేశాడు. వార్తల ప్రకారం, వచ్చే నెలలో శిఖర్ , సోఫీ వివాహం జరగనుంది.

## రిజ్వాన్‌కు భారీ అవమానం..

ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్‌లో సోమవారం సిడ్నీ థండర్ వర్సెస్ మెల్బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఒక చారిత్రాత్మక నిర్ణయానికి వేదికైంది. మెల్బోర్న్ రెనెగేడ్స్ తరపున ఆడుతున్న పాకిస్థాన్ స్టార్ మొహమ్మద్ రిజ్వాన్‌ను, అతని నెమ్మదైన బ్యాటింగ్ కారణంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ ఇన్నింగ్స్ మధ్యలోనే వెనక్కి పిలిపించారు. దీంతో బీబీఎల్ చరిత్రలో 'రిటైర్డ్ అవుట్' అయిన తొలి విదేశీ ఆటగాడిగా రిజ్వాన్ నిలిచాడు.సిడ్నీ థండర్‌తో జరిగిన ఈ పోరులో మెల్బోర్న్ రెనెగేడ్స్ మొదట బ్యాటింగ్ చేపట్టింది. నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన మొహమ్మద్ రిజ్వాన్ క్రీజులో పాతుకుపోయినప్పటికీ, ఆశించిన స్థాయిలో పరుగులు రాబట్టలేకపోయాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడాల్సిన సమయంలో రిజ్వాన్ సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. ఆయన 23 బంతుల్లో కేవలం 26 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్సర్) మాత్రమే చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ 113 దగ్గరే ఆగిపోవడంతో, స్కోరు బోర్డు వేగం తగ్గింది.ఇన్నింగ్స్ 18 ఓవర్లు ముగిసే సమయానికి మెల్బోర్న్ జట్టు 154/5 స్కోరుతో ఉంది. ఇన్నింగ్స్ ముగియడానికి ఇంకా 12 బంతులు మాత్రమే మిగిలి ఉండటంతో, భారీ హిట్టర్లు అవసరమని కెప్టెన్ విల్ సదర్లాండ్ భావించారు. డగౌట్ నుంచి సిగ్నల్ రావడంతో, రిజ్వాన్ ఎటువంటి గాయం లేకపోయినప్పటికీ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం దీనిని 'రిటైర్డ్ అవుట్'గా పరిగణిస్తారు.రిజ్వాన్ స్థానంలో స్వయంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ క్రీజులోకి వచ్చాడు. అయితే ఈ మాస్టర్ ప్లాన్ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సదర్లాండ్ ఎదుర్కొన్న మొదటి బంతికే రన్ అవుట్ అయి పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో రెనెగేడ్స్ జట్టు కేవలం 16 పరుగులు మాత్రమే జోడించగలిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. పాక్ ఆల్ రౌండర్ హసన్ ఖాన్ (31 బంతుల్లో 46) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.ఈ సీజన్‌లో మొహమ్మద్ రిజ్వాన్ ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఆయన కేవలం 167 పరుగులు మాత్రమే చేశాడు. ఆయన ఓవరాల్ స్ట్రైక్ రేట్ 101 గా ఉండటం టీ20 ఫార్మాట్‌లో ఆందోళన కలిగించే అంశం. పాకిస్థాన్ వైట్ బాల్ కెప్టెన్ అయిన రిజ్వాన్‌ను ఇలా మధ్యలోనే వెనక్కి పిలిపించడం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. గతంలో ఐపీఎల్‌లో రవిచంద్రన్ అశ్విన్ ఇలాంటి సాహసం చేయగా, ఇప్పుడు బీబీఎల్‌లో రిజ్వాన్ రూపంలో మరో ఉదాహరణ కనిపిస్తోంది. జట్టు ప్రయోజనాల కోసం ఆటగాళ్లను రిటైర్డ్ అవుట్ చేయడం ఆధునిక క్రికెట్‌లో ఒక వ్యూహంగా మారుతోంది.

# బ్యాటింగ్ శైలిని పూర్తిగా మార్చేసుకున్న కోహ్లీ



క్రికెట్ ప్రపంచంలో విరాట్ కోహ్లీ ఒక రన్ మెషీన్. గత దశాబ్ద కాలంగా అతను క్రీజులో ఉన్నాడంటే స్కోరు బోర్డు పరుగులెడుతుందని ఫ్యాన్స్‌కు నమ్మకం. అయితే నిన్నటి వరకు మనం చూసిన కోహ్లీ వేరు, ఇప్పుడు చూస్తున్న కోహ్లీ వేరు. సాధారణంగా విరాట్ క్రీజులోకి రాగానే కొంచెం సమయం తీసుకుని, సెటిల్ అయ్యాక గేర్ మారుస్తుంటాడు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను ఆడిన తీరు చూస్తే, కోహ్లీ తన బ్యాటింగ్ ఫిలాసఫీని పూర్తిగా మార్చేసుకున్నాడని అర్థమవుతోంది. వడోదరలో జరిగిన మ్యాచ్?లో కోహ్లీ ఫస్ట్ మూడు బంతుల్లోనే బౌండరీ బాదేశాడు. రాయ్‌పుర్, రాంచీ మ్యాచ్‌ల్లో కూడా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. బౌలర్ ఎవరైనా సరే, క్రీజులోకి రాగానే తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని కోహ్లీ ప్రయత్నిస్తున్నాడు. గతంలో ఇన్నింగ్స్?ను హోల్డ్ చేసే యాంకర్ రోల్ పోషించిన విరాట్ ఇప్పుడు మాత్రం ఎదురుదాడితో బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. అనవసరంగా వెయిట్ చేయకుండా మన స్ట్రెంగ్త్ మీద నమ్మకంతో కౌంటర్ ఎటాక్ చేయాలి అని కోహ్లీ స్వయంగా తన కొత్త ఫార్ములాను బయటపెట్టాడు.విరాట్ కోహ్లీ ఇప్పుడు ఏ రికార్డు కోసమో లేక తనని తాను నిరూపించుకోవడానికో ఆడటం లేదు. అన్నీ సాధించాక వచ్చే ఒక రకమైన స్వేచ్ఛ అతని బ్యాటింగ్ లో కనిపిస్తోంది. టెస్ట్, టీ20 రిటైర్మెంట్ తర్వాత వన్డేలలో మళ్ళీ స్ట్రాంగ్ రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ, తనలోని పాత ప్యాషన్?ను వెతుక్కుంటున్నట్లు కనిపిస్తోంది. గణాంకాలు చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. అక్టోబర్ నుంచి ఆడిన ఏడు మ్యాచుల్లో విరాట్ 106 స్ట్రైక్ రేట్‌తో 469 పరుగులు చేశాడు. ఇది అతని కెరీర్ యావరేజ్ స్ట్రైక్ రేట్ (93.7) కంటే చాలా ఎక్కువ. రికార్డుల భారం దింపేసి ఆడుతుండటం వల్లే ఈ అద్భుతమైన ఫామ్ సాధ్యమవుతోంది.కోహ్లీ ప్రస్తుత బ్యాటింగ్ స్టైల్ చూస్తుంటే కెప్టెన్ రోహిత్ శర్మ పద్ధతి గుర్తొస్తుంది. 2023 వన్డే వరల్డ్ కప్, 2024 టీ20 వరల్డ్ కప్‌లలో రోహిత్ కూడా ఇదే తరహా అగ్రెసివ్ మైండ్ సెట్‌తో ఆడి సక్సెస్ అయ్యాడు. వ్యక్తిగత రికార్డుల కంటే టీమ్‌కి మంచి ఆరంభం ఇవ్వడమే లక్ష్యంగా రోహిత్ బ్యాట్ ఝులిపించాడు. ఇప్పుడు విరాట్ కూడా అదే బాటలో నడుస్తున్నాడు. నెంబర్ 3 లో బ్యాటింగ్‌కి వచ్చే కోహ్లీ, బౌలర్లు సెటిల్ అవ్వకముందే వారి లయను దెబ్బతీస్తూ టీమ్ ఇండియాను సేఫ్ జోన్‌లో కూర్చోబెడుతున్నాడు.విరాట్‌లో వచ్చిన ఈ మార్పు కేవలం బ్యాటింగ్‌లోనే కాదు, తన ఆలోచనా విధానంలో కూడా కనిపిస్తోంది. "నేను ఇప్పుడు మైలురాళ్ల గురించి ఆలోచించడం లేదు, టీమ్‌ని కంఫర్టబుల్ పొజిషన్‌లో ఉంచడమే నా గోలు అని అతను ఓ క్లారిటీ ఇచ్చేశాడు. టెక్నిక్‌లో మార్పులు కంటే మెంటల్‌గా అతను ఎంత స్ట్రాంగ్‌గా ఉన్నాడనేది అర్థమవుతుంది. మెల్లగా ఆడుతూ వికెట్ ఇచ్చుకునే కంటే, తన బలాన్ని నమ్ముకుని అటాక్ చేయడం మంచిదని అతను భావిస్తున్నాడు. ఈ క్లారిటీయే అతన్ని క్రికెట్‌లో మళ్లీ తిరుగులేని వీరుడిగా మారుస్తోంది. వడోదర, రాయ్‌పుర్‌లలో కోహ్లీ కొట్టిన బౌండరీలు కేవలం రన్స్ మాత్రమే కాదు, ప్రత్యర్థులకు అతను ఇస్తున్న హెచ్చరికలు. తన ఆటను మార్చుకుంటూ మోడరన్ క్రికెట్ డిమాండ్స్‌కి తగ్గట్టుగా అతను అప్డేట్ అవుతున్నాడు. వయసు పెరుగుతున్నా తన ఫిట్‌నెస్, ఆకలి ఏమాత్రం తగ్గలేదని విరాట్ నిరూపిస్తున్నాడు. కెరీర్ చివరి దశలో ఉన్నా కూడా ఇంతటి ఎనర్జీతో, భయం లేకుండా ఆడటం నిజంగా గ్రేట్ అని చెప్పాలి. కింగ్ కోహ్లీ ఇదే జోరు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో టీమ్ ఇండియా మరిన్ని విజయాలను అందుకోవడం ఖాయం.

## వైభవ్ సూర్యవంశీ దెబ్బకు కోహ్లీ, గిల్ రికార్డులు బద్దలు



భారత క్రికెట్‌లో మరో అద్భుతమైన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. కేవలం 14 ఏళ్ల వయసులోనే తన బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దిగ్గజాల దృష్టిని ఆకర్షిస్తున్నాడు బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ. ప్రస్తుతం జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లలో పరుగుల వరద పారిస్తున్న ఈ యువ ఆటగాడు, త్వరలో జరగనున్న యూ19 వరల్డ్ కప్ 2026లో టీమిండియా స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ పేరిట ఉన్న భారీ రికార్డులను తుడిచిపెట్టేందుకు సిద్ధమయ్యాడు. యూత్ వన్డే కెరీర్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో వైభవ్ వేగంగా దూసుకుపోతున్నాడు. ఇప్పటివరకు ఆడిన 18 మ్యాచ్‌ల్లోనే 973 పరుగులు సాధించాడు. టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో మొత్తం 978 పరుగులు చేశాడు. అంటే, వైభవ్ మరో 6 పరుగులు చేస్తే చాలు, కోహ్లీ రికార్డును అధిగమించి ముందుకు వెళ్తాడు. కేవలం కోహ్లీ మాత్రమే కాదు, ప్రస్తుత టీమిండియా స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ రికార్డు కూడా వైభవ్ టార్గెట్‌లో ఉంది. గిల్ తన యూ19 వన్డే కెరీర్‌లో 1149 పరుగులు చేశాడు. వైభవ్ సూర్యవంశీ ఫామ్ చూస్తుంటే, రాబోయే అండర్-19 ప్రపంచ కప్‌లోనే ఈ మార్కును సులువుగా దాటే అవకాశం కనిపిస్తోంది.కేవలం 13 ఏళ్ల వయసులోనే యూత్ వన్డేల్లో సెంచరీ చేసిన రికార్డు వైభవ్ సొంతం.?సిక్సర్ల కింగ్: యూత్ వన్డేల్లో అత్యధికంగా 80కి పైగా సిక్సర్లు బాదిన రికార్డు కూడా ఈ చిన్నారి ఆటగాడి ఖాతాలోనే ఉంది.?రాబోయే యూ19 వరల్డ్ కప్‌లో వైభవ్ సూర్యవంశీ ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. తన పవర్ హిట్టింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు నిద్రలేకుండా చేస్తున్న ఈ 'వండర్ కిడ్ఙ భవిష్యత్తులో భారత సీనియర్ జట్టులో కూడా సంచలనం సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మారిన బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలు..

2026 టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలు మారవచ్చు అని తెలుస్తోంది. ఈ మేరకు బీసీసీఐ ఒక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వేదిక శ్రీలంకలో ఉంటుందా లేదా భారతదేశంలోని మరొక నగరానికి మారుస్తారా అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది? 2026 టీ20 ప్రపంచ కప్‌ను ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక నిర్వహించనున్న సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం, బంగ్లాదేశ్ జట్టు అన్ని గ్రూప్ మ్యాచ్‌లు మొదట కోల్‌కతా, ముంబైలలో జరగాల్సి ఉంది. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికను శ్రీలంకకు మార్చే అవకాశం లేదు. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను దక్షిణ భారతదేశానికి మార్చే అవకాశం ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. దీని అర్థం కోల్‌కతా, ముంబైలకు బదులుగా చెన్నై, తిరువనంతపురంలో మ్యాచ్‌లు నిర్వహించవచ్చు అని తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో హిందువుల హత్యలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు ప్రతిస్పందనగా బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి బీసీసీఐ బహిష్కరించింది. ఈ చర్యకు ప్రతిస్పందనగా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 2026 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను మార్చాలని ఐసీసీకి ఇమెయిల్ పంపింది. బంగ్లాదేశ్ తన మ్యాచ్‌లను భారతదేశం నుంచి శ్రీలంకకు మార్చాలని కోరింది. భద్రతా సమస్యలను పేర్కొంటూ భారతదేశంలో ఆడకూడదని తన ఇమెయిల్‌లో కోరికను వ్యక్తం చేసింది. ఇటీవలి నివేదికలు బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదిక మార్పును సూచిస్తున్నాయి. అయితే, ఇది బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు డిమాండ్ వల్ల జరిగిందా లేదా అని చెప్పడం కష్టం, ఎందుకంటే ఇది బీసీసీఐ నిర్ణయం అని నివేదికలు సూచిస్తున్నాయి.2026 టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ తన ప్రచారాన్ని ఫిబ్రవరి 7న ప్రారంభించనుంది. షెడ్యూల్ ప్రకారం, అది తన మొదటి మ్యాచ్‌ను వెస్టిండీస్‌తో కోల్‌కతాలో ఆడాల్సి ఉంది. ఆ తర్వాత, ఫిబ్రవరి 9న ఇటలీతో, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు కూడా కోల్‌కతాలోనే జరగనున్నాయి. బంగ్లాదేశ్ తన చివరి లీగ్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్‌తో ఆడనుంది.

## ఆయుష్ బదోనికి పిలుపు!

న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆడుతున్న భారత్ జట్టులో మార్పులు చేర్పులు జరిగాయి. బౌలింగ్ చేస్తున్నప్పుడు గాయపడ్డ వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఆయుష్ బదోనీకి పిలుపునిచ్చారు. వన్డే సిరీస్‌లో భాగంగా వడోదరలో ఆదివారం జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని స్థానంలో ఆయుష్ బదోనిని ప్రకటించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. దీంతో ఆ రెండు మ్యాచ్‌లకు వాషింగ్టన్ స్థానంలో బదోని ఆడనున్నాడు. నవరి 14, 18 తేదీల్లో భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో, మూడో వన్డే మ్యాచ్‌లు జరగనున్నాయి. , వాషింగ్టన్ సుందర్ స్థానంలో భారత జట్టులో ఇప్పుడు బదోని చేరాడు. ఆయుష్ బదోని ఎవరు, అతను మొదటిసారిగా టీమ్ ఇండియా జట్టులోకి ఎందుకు ఎంపిక చేశారు. అలాంటి ఫెర్ఫార్మెన్స్ యన ఏం చేశాడో ఇక్కడ తెలుసుకోండి. ఆయుష్ బదోని డిసెంబర్ 3, 1999న ఢిల్లీలో జన్మించాడు, అయితే అతను వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందినవాడు. అతని కుటుంబం దేవప్రయాగ్ బ్లాక్‌లోని చిన్న గ్రామం సిలోడ్‌కు చెందినది. వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందిన అతని కుటుంబం తరువాత ఢిల్లీకి షిఫ్ట్ అయ్యింది, దీని కారణంగా ఆయుష్ తన బాల్యాన్ని ఢిల్లీలోనే గడిపాడు. ఆయుష్ బదోనికి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. 9 సంవత్సరాల వయస్సులోనే క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రాక్టీస్ ప్రారంభించాడు. కుమారుడి టాలెంట్ గుర్తించిన తండ్రి బదానిని సోనెట్ క్రికెట్ అకాడమీలో కోచింగ్ కోసం జాయిన్ చేశాడు. అప్పటి వరకు తండ్రి వద్దే శిక్షణ తీసుకున్నాడు. అంటే వాస్తవానికి అతని మొదటి కోచ్ అతని తండ్రి వివేక్ బదోని అయ్యారన్నమాట. వివేక్ తన కొడుకులో క్రికెట్ పట్ల ఉన్న మక్కువను చూసి బంతి, బ్యాట్‌ను ఎలా ఉపయోగించాలో నేర్పించడం ప్రారంభించాడు. వివేక్ బదోని వృత్తిరీత్యా డాక్యుమెంటరీ సినిమాలు తీస్తారు. ఆయుష్ తల్లి, విభ బదోని వృత్తిరీత్యా స్కూల్ టీచర్. బదాని ఆసక్తిని గమనించిన తండ్రి వివేక్ ఇంటి పైకప్పును నెట్ ప్రాక్టీస్ ఏరియాగా మార్చారు. ఆయుష్ ఇక్కడే నెట్ ప్రాక్టీస్ చేసేవాడు. 26 ఏళ్ల ఆయుష్ బదోని దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ తరపున ఆడాడు. ఐపీఎల్లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అరంగేట్రం చేశాడు. 2022లో లక్నో సూపర్ జెయింట్స్ బదోనిని 20 లక్షల రూపాయలకు తమ జట్టులో చేర్చుకుంది. అప్పటి నుంచి అతను ఈ జట్టు కోసం ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026లో అతనికి 4 కోట్ల రూపాయల భారీ జీతం లభించనుంది.





# కథ చిన్నదే అయినా.. కథనం ఆద్భుతం

## ప్రేక్షకులను సరదా పట్టించిన మనశంకర వరప్రసాద్

సాధారణంగా చిరంజీవి సినిమా అంటే .ఓష్...దానికి తోడు ప్రత్యేక పాత్రలో వెంకటేశ్ తోడయ్యాడు. ఇంకేముందీ.. అంచనాలు అంబరాన్ని తాకాయి. విడుదలైన ప్రచార చిత్రాలన్నీ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక హిట్ మిషిన్ అనిల్ రావిపూడి ఈ సినిమాకు దర్శకుడు కావడంతో విజయం తథ్యం అని జనాలంతా ఫిక్సయిపోయారు. ఇంతటి పాజిటివ్ వాతావరణం మధ్య ఎట్టకేలకు సోమవారం 'మన శంకర వరప్రసాద్‌గారు' సంక్రాంతికి వచ్చేశారు. కథలోకి వెళితే... కేంద్రమంత్రి శర్మ(శరత్ సక్సేనా)కు 'నిన్ను చంపేస్తున్నాం' అంటూ ఓ హంతకుల గ్యాంగ్ నుంచి బెదిరింపు కాల్ రావడం.. ఆయన దగ్గర పనిచేస్తున్న నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్ శంకర్‌వరప్రసాద్(చిరంజీవి) ఆ గ్యాంగ్‌ని తుదముట్టించడంతో కథ మొదలవుతుంది. శంకర్‌వరప్రసాద్‌ని శర్మ తన కుటుంబ సభ్యుడిగా చూసుకుంటూ ఉంటాడు. ఎప్పుడూ సరదాగా ఉండే శంకరప్రసాద్ మనసులో ఏదో బాధ ఉన్నదని గ్రహించిన శర్మ.. ఓ రోజు శంకరప్రసాద్‌ని కారణం అడగుతాడు. భార్యతో విడిపోవడం.. కన్నబిడ్డలకు దూరం కావడం.. ఇవే శంకర వరప్రసాద్ బాధకు కారణాలని శర్మకు అర్థమవుతుంది. అందుకే ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుకుంటున్న పిల్లల్ని కలుసుకునే ఏర్పాటు చేస్తాడు శర్మ. ఆ స్కూల్‌లో పీఈటీగా జాయిన్ అయిన శంకర వరప్రసాద్.. తన పిల్లలకు ఎలా చేరువ-య్యాడు? అసలు శంకరప్రసాద్ భార్యతో విడిపోవడానికి కారణం ఏంటి? చివరకు ఆ కుటుంబం ఎలా కలిసింది? అనే ప్రశ్నలకు సమాధానమే మిగతా కథకథగా చెప్పుకుంటే పెద్దగా కథేం కాదు. కానీ ఉన్న కథను క్యూట్‌గా.. ఎక్కడా అనవసరపు పాత్రలు కానీ, సన్నివేశాలు కానీ లేకుండా అర్థవంతంగా నడిపాడు దర్శకుడు అనిల్ రావిపూడి. సాధారణంగా ఇలాంటి కథలకు లాజిక్కులు వెతక్కూడదు. ఈ సినిమాలో కూడా కొన్ని లాజిక్ లేని విషయాలున్నా అవి ఆడియన్స్‌ని అంతగా ఇబ్బంది పెట్టవ్. అపార్థం చేసుకొని విడిపోయిన భార్యకు తానేంటో అర్థం కావాలని తపించే భర్త కథ ఇది. దూరమైన బిడ్డలను అక్కున చేర్చుకోవాలని తహతహలాగే ఓ తండ్రి కథ ఇది. ఈ కథ చుట్టూ వినోదాన్ని మేళవించి జనరంజకంగా మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి. ప్రధాన పాత్రల మధ్య ఏర్పాడే ఆయా పరిస్థితుల నుంచి పుట్టే కామెడీనే ఈ సినిమాలో ఆద్యంతం కనిపిస్తుంది. సిట్యువేషనల్ కామెడీ కావడంతో సినిమా ఎక్కడా విసుగు రాలేదు. ప్రథమార్థం పాత్రల పరిచయాలు, హీరోహీరోయిన్లు కలవడం, విడిపోవడం, దానికి సంబంధించిన పరిస్థితుల నేపథ్యంలో సాగింది. సమస్యలు సీరియస్‌వే అయినా.. చెప్పడం మాత్రం వినోదంగా చెప్పాడు. ఈ కథలో విలన్ పాత్ర గురించి ప్రత్యేకించి చెప్పాలి. చిరంజీవి సినిమాల్లో విలన్ అంటే అత్యంత శక్తిమంతుడిగా, ప్రమాదకారిగా కనిపిస్తాడు. కానీ ఈ సినిమాలో ప్రధాన విలన్ ఓ కామన్ మ్యాన్ కావడం

విశేషం. అతను విలన్‌గా మారే పరిస్థితులు కూడా లాజికల్‌గానే అనిపిస్తాయి. అసలు విలన్ కామన్ మ్యాన్ అవ్వడం వల్లే ఈ కథలో ఆసక్తి ఇంకాస్త పెరిగిందనాలి.ద్వితీయార్థం కొంతభాగం కాస్త సీరియస్ వేలో సాగినా.. చివరి 20 నిమిషాలు వెంకటేశ్ ఎంట్రీతో సినిమా మళ్లీ వినోదంవైపు టర్న్ తీసుకున్నది. వెంకీగౌడాగా తెరపై వెంకటేశ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఓ విధంగా ఆయన ఉన్నంతవరకూ తెరపై అందర్నీ డామినేట్ చేశారు. తెరపై చిరంజీవి, వెంకటేశ్ ఒకే ఫ్రేమ్‌లో సందడి చేయడం.. అభిమానులకే కాదు, సగటు ప్రేక్షకుడికి కూడా కన్నుల పండుగ అనిపించింది. శంకరవరప్రసాద్‌గా చిరంజీవి అభినయం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటి పాత్రలు ఆయన కేక్‌వాక్. ఎప్పటిలాగే తనదైన యాక్షన్, కామెడీ, ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని అలరించారు చిరంజీవి. సరదాగా ఉన్నప్పుడు 'చంటాబ్బాయి'ని గుర్తు చేస్తూ.. అవసరమైనప్పుడు రౌడీ అల్లుడ్నీ, ఘరనామొగుడ్నీ యాదికి తెస్తూ.. పాటల్లో 'కొండవీటి దొంగ'ను.. యాక్షన్‌లో 'గ్యాంగ్ లీడర్'ని గుర్తు చేస్తూ వింటేజ్ మెగాస్టార్ తెరపై సాక్షాత్కరించారని చెప్పక తప్పదు. ఇక ఇందులో చిరంజీవికి సమానమైన పాత్ర నయనతారది. ఆ పాత్రలో ఉండే దర్పం, అభిజాత్యాన్ని అద్భుతంగా పలికించింది నయనతార. ఆమె చేయడం వల్ల ఆ పాత్రకు నిండుదనం వచ్చిందని చెప్పొచ్చు. ఇక సచిన్ ఖేడేకర్‌ది ఇందులో కీలకమైన పాత్ర. ఎప్పటిలాగే తనదైన అభినయంతో ఆయన ఆకట్టుకున్నారు. మిగతా నటీనటులంతా తమదైన పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఇక చివరిగా వెంకటేశ్ చివరి 20 నిమిషాలు ఆయన సినిమాలో కనిపిస్తారు. అప్పటివరకూ ఓ స్థాయిలో నడిచిన సినిమాను తన రాకతో పరుగులు పెట్టించాడు వెంకటేశ్. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ నిజంగా సూపర్బ్. చిరంజీవి, వెంకటేశ్ పాత్రల్నీ ఆయన ట్యాకిల్ చేసిన తీరు మాత్రం నిజంగా అభినందనీయం. ఇక ఈ సినిమా ప్రధాన బలాల్లో భీమ్స్ సంగీతం ఒకటి. ప్రతి పాటా జనాలకు నచ్చింది. నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకునేలా ఉంది. సమొత్తంగా ఆద్యంతం తనదైన కామెడీతో గిలిగింతలు పెడుతూ.. అక్కడక్కడ ఎమోషన్స్‌తో మనసుల్ని గిల్లుతూ, అవసరమైన చోటా మెగాస్టార్ గ్రేస్‌ని నేటి తరానికి పరిచయం చేస్తూ, అభిమానులకు వింటేజ్ మెగాస్టార్‌ని గుర్తు చేస్తూ.. అద్భుతంగా సినిమాను మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి.

# రాజాసాబ్ ప్రభాస్

## మూడ్రోజుల వసూళ్ళు.183 కోట్ల గ్రాస్



మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ది రాజాసాబ్' సినిమా సోషియో ఫాంటసీ డ్రామాగా రూపొందింది. మైండ్ గేమ్ ఛాలెంజింగ్‌గా వచ్చిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. నైజాం ప్రీమియర్స్ పరంగా కాస్త దెబ్బ పడిన ఓవరాల్ మాత్రం సాలిడ్ స్టార్టప్ అందుకుంది రాజాసాబ్. మొదటి రోజు ప్రపంచ వ్యాప్తంగా రూ. 112 కోట్లు గ్రాస్ వసూలు చేసింది. దీంతో.. ప్రభాస్ కెరీర్లో వంద కోట్ల ఓపెనింగ్స్ రాబట్టిన 6వ సినిమాగా రాజాసాబ్ రికార్డ్ నమోదు చేసింది. మిక్స్ టాక్ వచ్చిన సరే ఎక్కడా తగ్గకుండా దూసుకెళ్తున్నాడు రాజాసాబ్. ఇక ఈ సినిమా ఫస్ట్ వీక్ రన్ ఫినిష్ చేసుకుంది. రిలీజ్ అయిన మూడు రోజులకు గాను రూ. 183 కోట్ల గ్రాస్ రాబట్టి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక నేటి నుండి వరుస సెలవలు కావడంతో బుకింగ్స్ లో జోరు చూపిస్తూ ఈ రోజు ముగిసేనాటికి రూ. 200 కోట్ల మార్క్ అందుకుంటుందనీ ట్రేడ్ అంచనా వేస్తుంది.

## సుప్రీంను ఆశ్రయించిన జననాయగన్



'జన నాయగన్'కు మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'జన నాయగన్' టీమ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతూ నేడు పిటిషన్ వేసింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డును మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. అయితే, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. తదుపరి విచారణను జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పుడీ స్టే పై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



# నిఖిల్ స్వయంభుపై పెరుగుతున్న అంచనాలు




విడుదలకు సిద్ధంగా ఉన్న పాన్ ఇండియా చిత్రాలో 'స్వయంభు' ఒకటి. యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ నటిస్తున్న ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా,సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అయితే తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతుంది.పిరియాడికల్ మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇంటర్వెల్ సీక్వెన్స్ హైలైట్ కాబోతోందట. ఈ సీన్‌లో నిఖిల్ ఇతర ప్రధాన పాత్రల మధ్య వచ్చే యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా, రా గా ఉంటాయని సమాచారం. ముఖ్యంగా ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో నిఖిల్ గెటప్, యుద్ధ సన్నివేశాల సెటప్ ప్రేక్షకులను థ్రిల్ కి గురిచేస్తాయని ఇన్సైడ్ టాక్. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సీన్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లనున్నాయట. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా, ఈ లేటెస్ట్ యాక్షన్ అప్‌డేట్ నిఖిల్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.

## 'పరాశక్తి'పై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం

'పరాశక్తి'పై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నారని విజయ్ అభిమానులపై నటుడు, నిర్మాత దేవ్ రామ్‌నాథ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు బుక్ మై షోలో నెగెటివ్ రివ్యూలు ఇస్తున్నారని సినిమాను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదన్నారు. నెగెటివ్ రివ్యూలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను ఎక్స్‌లో షేర్ చేసిన ఆయన కొందరు విజయ్ ఫ్యాన్స్‌ను ఉద్దేశిస్తూ పోస్ట్ పెట్టారు. థియేటర్‌ల వద్ద ఉద్దేశపూర్వకంగా 'పరాశక్తి'కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. మీ సినిమా (జననాయగన్)కు పోటీగా మేం విడుదల చేసినందుకే ఇలా చేస్తున్నారా?. ఈ కారణంగా మా సినిమాను దెబ్బతీసే హక్కు మీకు లేదు. మేం ముందుగా విడుదల తేదీని ప్రకటించాం. మేం మీ సినిమాను అడ్డుకోవడానికి ప్రయత్నించలేదు కదా.. మరెందుకు ఇలా చేస్తున్నారు. 'జననాయగన్'కు వచ్చినట్లే మాకు కూడా సెన్సార్ సమస్యలు వచ్చాయి. విడుదలకు 18 గంటల ముందు వరకు మేం కూడా ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాం. సీబీఎఫ్‌సీ కార్యాలయానికి ఎన్నోసార్లు వెళ్లాం. నెగెటివ్ రివ్యూలు, పాత వీడియోలు ఉపయోగించి ప్రజలను ప్రభావితం చేయాలని చూడడం, థియేటర్‌లో రాజకీయ నినాదాలు చేయడం. బుక్ మై షోలో రేటింగ్ తగ్గించడం.. ఇలాంటి పనులు చేసే వారికి పోటీ అని చెప్పే హక్కు లేదు. గతేడాది విడుదలైన ఓ పెద్ద సినిమాకు కూడా ఇలానే చేశారు. ఇది ఇండస్ట్రీకి మంచిది కాదు. పరాశక్తి చాలా గొప్ప సినిమా' అని తన ఎక్స్ పోస్ట్‌లో దేవ్ రామ్‌నాథ్ రాసుకొచ్చారు.

## శోభితా ధూళిపాళ్ల....చీకటిలో !

శోభితా ధూళిపాళ్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'చీకటిలో'. అమెజాన్ ప్రైమ్ వేదికగా జనవరి 23 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. న్యూస్ ఛానల్‌లో యాంకర్ జాబ్ మానేసి సొంతంగా ఛానల్ పెట్టి స్నేహితుల హత్యల వెనక ఉన్న కారణాన్ని కనిపెట్టే సంధ్య పాత్రలో శోభిత కనిపించారు. సోషల్ మీడియా పోస్ట్‌లో ట్యాగ్ చేసినందుకే హత్య చేశాడా.. అంటూ ఆసక్తికరమైన ప్రశ్నతో ముగించిన ఈ ట్రైలర్‌ను మీరూ చూసేయండి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి



**నర్సీపట్నం:** భారతీయ జనతా పార్టీ నర్సీపట్నం నియోజకవర్గం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు శీరంరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ, స్వామి వివేకానంద భారతదేశానికి గొప్ప ఆధ్యాత్మిక నాయకుడు, గొప్ప దేశభక్తుడని కొనియాడారు. తన తేజస్సుతో కూడిన ప్రసంగాల ద్వారా ప్రజలను ఉత్తేజపరిచే శక్తివంతుడని అన్నారు. కేవలం 39 సంవత్సరాల జీవితకాలంలోనే స్వామి వివేకానంద వేల సంవత్సరాలు చెరిగిపోని ముద్ర వేశారని, భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచమంతా చాటి చెప్పారని తెలిపారు.అనకాపల్లి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షులు డాక్టర్ కిల్లాడ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ, స్వామి వివేకానంద చిన్న వయసులోనే అనేక గ్రంథలు, రచనలు చేశారని గుర్తు చేశారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినా కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లను చదివించి ఉద్యోగాల్లో స్థిరపరిచారని తెలిపారు. ఎన్నో రోజుల పాటు ఆకలితో గడిపిన అనుభవాలు ఉన్నప్పటికీ, దేశమంతా పర్యటించి ప్రజల జీవన స్థితిగతులను ప్రత్యక్షంగా తెలుసుకొని భారతదేశ చరిత్రను ప్రపంచానికి పరిచయం చేశారని అన్నారు. నేటి యువత స్వామి వివేకానంద రచనలను అధ్యయనం చేసి ఆయన మార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బోలెం శివ, నర్సీపట్నం పట్టణ అధ్యక్షులు బోలెం అప్పన్నదొర, బీజేవైఎం నాయకులు గవిరెడ్డి త్రినాథ్, మాకవరపాలెం మండల అధ్యక్షులు మర్రి నాయుడు, ఆంజనేయమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరాల పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ



**విజయవాడ:** ఈనెల 19వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహింపబడును. అన్ని మండలాల్లో పశువైద్యాధికారుల సారథ్యంలో రెండు బృందాలను ఏర్పాటుచేసి ఈ శిబిరాలను నిర్వహింపబడును. ఈ ఉచిత పశువైద్య శిబిరాలలో గొర్రెలు, మేకలకు, పెద్ద పశువులకు, లేగ దూడలకు ఉచితంగా నట్టల నిర్మూలన మందులు త్రాపించబడును. గొర్రెలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు, కోళ్లలో కొక్కెర తెగులు నివారణ టీకాలు వేయబడతాయి. అనారోగ్య పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వబడును. కావున రైతు సోదరులు ఈ ఉచిత పశువైద్య శిబిరాలలో అందించే పశు వైద్య సేవలు పొందవలసిందిగా కోరడమైనది. జిల్లా కలెక్టర్ ఈ ఉచిత పశు వైద్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు.

# జెసిఐ ఫ్లామింగోస్ అధ్యక్షుడు సాధు సాయికి ఉత్తమ కార్యదర్శి అవార్డు



**సూళ్లూరుపేట:** జెసిఐ ఫ్లామింగోస్ క్లబ్ అధ్యక్షుడు సాధు సాయి విశాఖపట్నంలో నిర్వహించిన జెసిఐ ప్రెసిడెన్షియల్ అకాడమీ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రదర్శించిన నాయకత్వ ప్రతిభ, కార్యనిర్వహణ సామర్థ్యం, సేవా దృక్పథన్ని గుర్తించిన జాతీయ స్థాయి జెసిఐ నాయకత్వం ఆయనను అత్యుత్తమ కార్యదర్శిగా ఎంపిక చేసింది. శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో జాతీయ అధ్యక్షుడు స్వయంగా సాధు సాయికి ఉత్తమ కార్యదర్శి అవార్డును అందజేశారు. ఈ ఘనతతో సూళ్లూరుపేటకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని జెసిఐ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాధు సాయి మాట్లాడుతూ, ఈ పురస్కారం తనకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో యువత అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, నాయకత్వ శిక్షణల ద్వారా సమాజానికి మరింత సేవలందిస్తానని తెలిపారు. ఆయనకు జెసిఐ సభ్యులు, అభిమానులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# అట్టహాసంగా ముగిసిన ఫ్లెమింగో ఫెస్టివల్







**సూళ్లూరుపేట:** పులికాట్ సరస్సును కేంద్రంగా చేసుకుని సూళ్లూరుపేట ప్రాంతాన్ని సంపూర్ణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు వైభవంగా సాగిన ఫ్లెమింగో ఫెస్టివల్--2026 మూడో రోజు ఘనంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పర్యాటకులు, స్థానిక ప్రజలతో సూళ్లూరుపేట ఉత్సవ వాతావరణంలో కిక్కిరిసిపోయింది.

ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ప్రధాన వేదికగా, భీమునివారి పాలెం, పులికాట్, నేలపట్టు ప్రాంతాల్లో ఉత్సవ సందడి నెలకొంది. వన్యప్రాణి, పశు సంవర్ధక, పర్యాటక, వైద్య, మహిళా సాధికారత శాఖలతో పాటు స్థానిక సంస్థల స్టాల్స్, ఫుడ్ కోర్టులు, ఆటల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిన్నపిల్లలు, యువత, కుటుంబ సభ్యులు రంగుల రాట్నాలు, జాయింట్ వీల్స్, వాటర్ స్పోర్ట్స్, వివిధ ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మూడో రోజు సాయంత్రం జరిగిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ఈ ఫెస్టివల్‌ను అత్యంత విజయవంతంగా నిర్వహించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. హెలికాప్టర్ హెలీ రైడ్ ద్వారా పులికాట్ సరస్సు విహంగ వీక్షణ, సరస్సులో బోటింగ్ ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయని చెప్పారు. ఇరుకం గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు స్పీడ్ బోట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పులికాట్ సరస్సు ప్రపంచంలోనే అతి పెద్ద బ్రాకిష్ వాటర్ లేక్ అని, ఇలాంటి అపూర్వ ప్రకృతి సంపదను పరిరక్షిస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. ఫారెస్ట్, టూరిజం తదితర శాఖల సమన్వయంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. చెన్నై సమీపం, రోడ్డు--రైలు--నీటి మార్గాల లభ్యతతో సూళ్లూరుపేటను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గతంలో నిలిచిపోయిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మళ్లీ ప్రారంభించి, ఈ ఏడాది మరింత కొత్తదనంతో నిర్వహించామని తెలిపారు. హాట్ ఎయిర్ బెలూన్, పారాగ్లైడింగ్, హెలీ రైడ్ వంటి అడ్వెంచర్ కార్యక్రమాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయని అన్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ శాఖ, అధికారుల సమన్వయంతో ఫెస్టివల్‌ను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీ గాయకులు శ్రీకృష్ణ, లిప్సికా, జబర్దస్త్ టీం కళాకారులు, మిమిక్రీ శివరెడ్డి, ఎస్‌డీసీ డాన్స్ గ్రూప్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాంకర్ అరియానా గ్లోరి నిర్వహణలో సంగీత, నృత్య, హాస్య కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ కన్సర్వేటర్ సెల్వం, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఎన్. బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి దేవాలయ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఆర్డీవో కిరణ్మయి, జిల్లా టూరిజం అధికారి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా పక్షుల పండుగగా పేరొందిన ఫ్లెమింగో ఫెస్టివల్--2026 సూళ్లూరుపేటకు పర్యాటక గుర్తింపును మరింత పెంచుతూ ఘనంగా ముగిసింది.

# కొండేపాటి గంగాప్రసాద్‌కు సీపీఐ నేత నారాయణ పరామర్శ



**సూళ్లూరుపేట:** ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌ను సీపీఐ కేంద్ర పార్టీ నేత, ఆల్ ఇండియా కంట్రోల్ కమిటీ చైర్మన్ నారాయణ సోమవారం పరామర్శించారు. ఇటీవల గంగాప్రసాద్ సోదరుడు కొండేపాటి సత్యనారాయణ చౌదరి అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. గంగాప్రసాద్ నివాసానికి చేరుకున్న నారాయణ ముందుగా దివంగత సత్యనారాయణ చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గంగాప్రసాద్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేత మోదుగుల పార్థసారథి సహా ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆప్కో వస్త్రాల స్టాల్ ప్రారంభం

## ఆప్కో సేవలు వినియోగించుకోవాలన్న డీసీసీబీ చైర్మన్

**విజయనగరం :** జిల్లా ప్రజలందరూ ఆప్కో సేవలను వినియోగించు కోవాలని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున కోరారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర కార్యాలయ ఆవరణలో ఆప్కో వస్త్ర స్టాల్ ను నాగార్జున ప్రారంభించారు. ఆప్కో వస్త్రాలు సాంప్రదాయ నైపుణ్యాలను, కళను ప్రతిబింబస్తాయని కొనియాడారు. విభిన్నమైన, అందమైన చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా ఉండాలని కోరారు. ఈ స్టాల్ సోమవారం నుండి శని వారం వరకు 5రోజులు నిర్వహించటం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలుకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించెందేదుకు డీసీసీబీ సంస్థ సభ్యులుగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పిల్లి రమేష్, బ్యాంకు సీఈఓ ఉమామమహేశ్వరరావు, జనరల్ మేనేజర్లు బి.ఎస్.ఎస్ ప్రసాద్, కె.వి.వి.ఆర్.ఎన్ సత్యనారాయణ (వాసు), ఎం. రామకృష్ణ, అర్.వి.మురళికృష్ణ (ఎడి హ్యాండ్లూమ్స్) పాల్గొన్నారు.

# రెడ్ బుక్ పేరుతో అడ్డదిడ్డంగా కేసు

## భోగి మంటల్లో రెడ్‌బుక్ తగలబెట్టంది

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

**అమరావతి :** రాష్ట్రంలో అమలవుతున్నట్లు చెబుతున్న 'రెడ్‌బుక్ రాజ్యాంగం' వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల మండిపడ్డారు.. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి రైతు అన్నమో రామచంద్ర అంటూ లబోదిబో మంటూ ఏడ్చే పరిస్థితి నెలకొందని శ్యామల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు.. వచ్చే రెండు సంక్రాంతుల్లో ప్రజల ముఖాల్లో చిరునవ్వు కనిపించకపోవచ్చు.. కానీ, 2029 తర్వాత వచ్చే సంక్రాంతి నాటికి ప్రతి రైతు ముఖంలో చిరునవ్వు తెచ్చే బాధ్యతను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇక, ఈ బోగి మంటల్లో రాష్ట్రానికి కీడుగా మారిన రెడ్‌బుక్‌ను తగలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి, జోగి రమేష్, కాకాణి గోవర్ధన్ రెడ్డి వంటి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేశారని ఆరోపించారు. ఇప్పటి పరిస్థితి ఏంటంటే.. ఈ రెడ్‌బుక్ రాజ్యాంగంలో కోడిని కోసినా కేసే.. కేక్ కట్ చేసినా కేసే.. అన్నట్టుగా పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రభుత్వ వ్యవస్థలు పని చేస్తున్నాయని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి పరిస్థితులకు ప్రజలే తగిన సమయంలో గట్టి సమాధానం చెబుతారని, రాష్ట్రంలో మళ్లీ న్యాయం, సంక్షేమం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రక్షణ కవచం జనసేన పార్టీ



## ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**చల్లపల్లి:** ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రక్షణ కవచం జనసేన పార్టీ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి, మండల పరిధిలోని వెలువోలు బీసీ కాలనీలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరికల కార్యక్రమం జరిగింది. గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు కోనేరు శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు పెనుమత్స కృష్ణారావు ఆధ్వర్యంలో వెలువోలు కుమ్మరిపాలెంకు చెందిన కైతేపల్లి వెంకటేశ్వరరావు, బొల్లా జగన్మోహనరావు, కైతేపల్లి నాగ సుధారాణి, మెరుగుమాల శ్రీనివాసరావు, వేములమడ వీర శ్రీనివాసరావు సహా ఇరవై మంది వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు జనసేన పార్టీలో చేరారు. ఘంటసాల మండలం పాపవినాశనం నుంచి జనసేన పార్టీ నాయకులు డొక్కు భీమరాజు, నెరుసు రాము, కలకండ నాగమల్లేశ్వరరావు, నెరుసు గోపీ, నెరుసు గోపీచంద్ ఆధ్వర్యంలో గొరిపర్తి పోతురాజు, కోసూరు వెంకటేష్, గొరిపర్తి రాము, కొలుసు శ్రీధర్, గోళ్ళ రాంబాబు సహా 16మంది వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ జనసేన పార్టీ కండువాలతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జనసేన పార్టీలో చేరిన వారు పార్టీలో ఉన్న వారితో, టీడీపీతో మమేకమై పని చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమిలో సఖ్యతగా మెలగాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పదేపదే చేస్తున్న దిశా నిర్దేశం ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. కూటమిలో ఉంటూనే జనసేన పార్టీని బలోపేతం చేసుకోవటం మన బాధ్యత అన్నారు. అభివృద్ధిని విస్మరించిన వైసీపీ తీరుకు విసుగు చెంది, గ్రామీణ అభివృద్ధికి బాటలు వేస్తున్న పవన్ కళ్యాణ్ ఆచరణ నచ్చి జనసేన పార్టీలో చేరిన వారిని అభినందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి తాను మంజూరు చేసి నిర్మాణ పనులు సగంలో ఉన్న అనేక రోడ్లను రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ పాలకులు రద్దు చేసి పనులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్ళీ ఆ రోడ్ల నిధులు వెనక్కు తేవటం చాలా కష్టంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే అనేక రోడ్లు నిర్మించామని, మరిన్ని రోడ్లు నిర్మిస్తామని ప్రకటించారు. వెలువోలు గ్రామంలో కరకట్ట వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఇచ్చిన నిధుల నుంచి రూ.12లక్షలతో నిర్మించనున్నట్లు గ్రామస్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. వెలువోలు ప్రజలకు అవసరమైన మరొక ప్రధాన రహదారి అవనిగడ్డ- విజయవాడ కరకట్ట రోడ్డు అభివృద్ధికి రూ.130 కోట్లు అవసరం అన్నారు. ఈ నిధుల సాధనకు శతవిధాలుగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన పార్టీ నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అతిథులను ఘనంగా సత్కరించారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మత్స్యకార విభాగం కార్యదర్శి లంకె యుగంధర్, చల్లపల్లి, ఘంటసాల మండల పార్టీ అధ్యక్షులు చోడగం విమల్ కృష్ణ, కోన రాజశేఖర్, ఎంపీటీసీ సిద్ధినేని కుమార్ రాజా, చల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ సూదాని నందగోపాల్, పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేవల పంపిణీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్

**ప్రజల సంతృప్తి స్థాయి గీటురాయిగా ముందడుగు**

**పేదరిక నిర్మూలన దగ్గరి నుంచి డీప్ టెక్ వరకు పది సూత్రాలపై ప్రత్యేక దృష్టి**

**సమష్టి కృషితో జీడీడీపీ, తలసరి ఆదాయ వృద్ధికి కార్యాచరణ**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ:** ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా పాలనలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ స్ఫూర్తితో జిల్లాలో ప్రభుత్వ సేవల పంపిణీలో వేగాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం, ముఖ్యమంత్రి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు వర్చువల్‌గా హాజరయ్యారు. జీఎస్‌డీపీ, కీలక ప్రగతి సూచికలు (కేపీఐ), స్వర్ణాంధ్ర విజన్ – పది సూత్రాలు, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు, పీపీపీ ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రతిపాదనలు, రియల్‌టైమ్ గవర్నెన్స్, రెవెన్యూ సేవలు, వీబీ- జీ రామ్ జీ యాక్ట్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించి ఆయా అంశాల్లో ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుతో పాటు అన్ని రంగాల్లోనూ 18 శాతం సుస్థిర వృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలన–పీ4 మొదలు డీప్ టెక్ వరకు స్వర్ణాంధ్ర విజన్ పది సూత్రాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కీలక ప్రగతి సూచికల్లో జిల్లా ముందంజలో ఉందని, పేదరిక నిర్మూలనకు సంబంధించిన కార్యక్రమాల అమల్లో సమష్టి కృషితో పనిచేస్తున్నామన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ సేవల్లో ప్రజల సంతృప్తి పరంగానూ ముందంజలో ఉన్నామని.. ఇదేవిధంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటుచేసి రెవెన్యూ సేవలను సత్వరం అందించేందుకు, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. జీడీడీపీ, తలసరి ఆదాయ వృద్ధి లక్ష్యాలపైనా దృష్టిసారిస్తున్నామని, ఎంఎస్ఎంఈల కార్యకలాపాలను విస్తృతం చేసేందుకు కూడా కృషిచేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

# జాతీయ రహదారులు.. వృద్ధికి జీవనాడులు

**బెంగళూరు-విజయవాడ ఆర్థిక కారిడార్ పనుల్లో గిన్నిస్ రికార్డులు గర్వకారణం**

**రికార్డుల సాధనలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**విజయవాడ:** జాతీయ రహదారులు (ఎన్‌హెచ్) సమగ్ర ఆర్థిక వృద్ధికి జీవనాడులు అని, బెంగళూరు–కడప–విజయవాడ ఆర్థిక కారిడార్ పనుల్లో నాలుగు గిన్నిస్ రికార్డులు నమోదు కావడం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని, రికార్డుల సాధనలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.

సత్యసాయి జిల్లాలో సోమవారం జరిగిన బెంగళూరు–కడప–విజయవాడ ఆర్థిక కారిడార్‌కు సంబంధించి జాతీయ రహదారి పనుల్లో నాలుగు గిన్నిస్ రికార్డులు నమోదు కార్యక్రమానికి కేంద్ర రహదారుల రవాణా మంత్రిత్వ శాఖ మంత్రివర్యులు నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా హాజరుకాగా.. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు కూడా వర్చువల్‌గా హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆర్థిక కారిడార్ పరిధిలో జాతీయ రహదారుల అభివృద్ధి వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక రంగం బలోపేతమవుతుందని, సత్వర రవాణా సేవలు ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తాయన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధితో పరిశ్రమలకు ముడిసరుకు సరఫరా సులభతరమవుతుందని, ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా తరలించేందుకు వీలవుతుందన్నారు. ఇలా పారిశ్రామిక రంగం వృద్ధి చెందితే పెట్టుబడులు పెరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయన్నారు. గౌరవ ముఖ్యమంత్రి స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ వినూత్న కార్యాచరణకు గుర్తింపుగా గిన్నిస్ రికార్డులు లభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

# ధర్మసాగరంలో వైద్య శిబిరం



**నర్సీపట్నం:** మండలంలో గల ధర్మసాగరంలో షరీన్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో టైఫాయిడ్ వ్యాక్సిన్ పై అవగాహన కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సీపట్నం మండల జడ్పిటిసి రమణమ్మ, తహసిల్దార్ రామారావు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. టైబార్ అనేది టైఫాయిడ్ జ్వరానికి రక్షణ ఇచ్చే టైఫాయిడ్ వ్యాక్సిన్.దీనిని భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ తయారుచేసింది. ఇది వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆమోదం పొందిన వ్యాక్సిన్. టైఫాయిడ్ అనేది సాల్మొనెలా టైపి అనే బ్యాక్టీరియా వలన వచ్చే టైఫాయిడ్ ను ముందస్తుగా నివారించుకోవడానికి ఈ వ్యాక్సిన్ ప్రతి ఒక్కరు వేసుకోవాలని జడ్పిటిసి రమణమ్మ వివరించారు.ఆరు నెలల వయస్సు నుంచి పెద్దల వరకు అందరూ ఈ ఇంజెక్షన్ తీసుకోవచ్చునన్నారు. ఐదు సంవత్సరాల వరకు రక్షణ ఇస్తుందని భారతదేశంలో తయారైన అంతర్జాతీయ స్థాయి వ్యాక్సిన్ చిన్న పిల్లలకు కూడా బలమైన రోగనిరోధక శక్తి ఇస్తుంది.ఈ ఇంజెక్షన్ తీవ్రమైన జ్వరం ఉన్నప్పుడు అలెర్జీ ఉన్నవారికి డాక్టర్ సూచన మేరకు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నయ్య నాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నారా భువనేశ్వరికి అవార్డు రావటంపై హర్షం



**చల్లపల్లి:** ఎన్టీఆర్ ట్రస్ట్ ను సేవాభావంతో నిర్వహిస్తూ, హెరిటేజ్ ఫుడ్స్ ను సమర్ధవంతంగా నడుపుతూ సమర్థ నాయకత్వాన్ని నిరూపించుకుంటున్న నారా భువనేశ్వరి జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక సంస్థ ఇండియన్ డైరీ అసోసియేషన్ వారిచే ఔట్ స్టాండింగ్ డైరీ ప్రొఫెషనల్ అవార్డు అందుకోవటం సంతోషకరమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. నారా భువనేశ్వరికి అవార్డు రావటం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ సోమవారం చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్లో వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువనేత మండలి వెంకట్రామ్ ముఖ్యఅతిధిగా పాల్గొని టీడీపీ నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. తొలుత, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, టీడీపీ నేతలు నాదెళ్ల వెంకట నరసయ్య, మల్లంపల్లి శివరామకృష్ణ, బుల్లా కిషోర్, టీఎన్టీయూసీ రాష్ట్ర నేత కైతేపల్లి దాస్, ప్రిన్సిపాల్ మదుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

## 16 నుండి సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుండి 19వ తేదీ వరకు సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ మహిళల లీగ్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్ లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మూడు విభాగాల్లో లీగ్ జరుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఖేలో ఇండియా లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అనిమిని రవి నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

## సంక్రాంతి కబడ్డీ పోటీలు ప్రారంభం

**పోటీలను ప్రారంభించిన కౌన్సిలర్ చింతకాయల రాజేష్**





**నర్సీపట్నం :** సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా మండల స్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. స్థానిక వెలమవీధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, రుత్తల లచ్చుపాత్రుడు జ్ఞాపకార్థం ఈ పోటీలను ఏర్పాటు చేశారు. స్థానిక పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా వేడుకలను కౌన్సిలర్ చింతకాయల రాజేష్ జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి టాస్ వేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 12 నుండి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ కబడ్డీ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో 22 జట్లు తలబడునున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు కొయ్యూరు, రోలుగుంట, రావికమతం మండలాల నుండి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విజేతలకు భారీ నగదు బహుమతులను ప్రకటించారు. ప్రథమ బహుమతిగా రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి రూ. 15 వేలుగా నిర్ణయించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ స్పష్టం చేసింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పట్టణ సీఐ గఫూర్, టిడిపి నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వెలమవీధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.